# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :102 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శనివారం 21-06-2025 | పేజీలు:4 వెల: 2.00


## మరో విమానంలో సాంకేతిక సమస్య.. చెన్నైలో ఎమర్జెన్సీ ల్యాండింగ్

న్యూఢిల్లీ, విమానాల్లో సాంకేతిక సమస్యలు ఆందోళన కలిగిస్తున్నాయి. గత పదిరోజులుగా ఎయిర్ ఇండియా సహా పలు విమానాల్లో సాంకేతిక సమస్యలు వెలుగు చూస్తున్నాయి. తాజాగా చెన్నై నుంచి మధురైకి బయల్దేరిన ఇండిగో విమానంలో టెక్నికల్ సమస్యలు బయటపడ్డాయి.విమానం 68 మంది ప్రయాణికులతో శుక్రవారం ఉదయం 6:44 గంటల సమయంలో చెన్నై నుంచి మధురైకి బయల్దేరింది. విమానం టేకాఫ్ అయిన 30 నిమిషాల తర్వాత సాంకేతిక సమస్య తెల్తింది. అప్రమత్తమైన పైలట్ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. విమానాన్ని తిరిగి చెన్నైకి మళ్లించేందుకు అనుమతి కోరాడు. తిరిగి ఉదయం 7:17 గంటలకు విమానం చెన్నై ఎయిర్‌పోర్ట్‌లో అత్యవసరంగా ల్యాండ్ చేశారు. విమానం అక్కడ సురక్షితంగా ల్యాండ్ అయ్యింది. అందులోని ప్రయాణికులను కిందకుదించి.. సమస్యను పరిష్కరిస్తున్నారు. ప్రయాణికుల కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, ఈ ఘటనపై ఇండిగో నుంచి ఎలాంటి అధికారిక ప్రకటనా రాలేదు.

# రేవంత్ రెడ్డి ఓ గురివింద గింజలాంటోడు...



హైదరాబాద్ : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. రేవంత్ రెడ్డి గురివింద గింజ లాంటోడు అని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో జీవన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు.దొంగే దొంగ అని అరిచినట్టుంది రేవంత్ తీరు. హామీలు అమలు చేయకుండా రేవంత్ రెడ్డి రే వోంట్ రెడ్డి గా మారారు. కేసీఆర్ అంటే ట్రిపుల్ ఆర్ స్కీమ్స్.. రేవంత్ అంటే ట్రిపుల్ ఆర్ స్కామ్స్ అని విమర్శించారు. ట్రిపుల్ ఆర్ అంటే రేవంత్ రెడ్డి ,రాహుల్ గాంధీ, రంజిత్ రెడ్డి స్కామ్స్. కేసీఆర్‌వి ట్రిపుల్ ఆర్ స్కీమ్స్ అంటే రైతు బంధు, రైతు రుణమాఫీ, రైతు బీమా అని తెలిపారు. కుంభకోణాల ద్వారా వసూలు చేసిన డబ్బు రాహుల్ గాంధీకి వెళ్తోంది. కేటీఆర్ మీద కేసు సిగ్గు చేటు అని మండిపడ్డారు. అసలు ఏఐసీసీ అంటేనే ఆల్ ఇండియా కరప్షన్ సెంటర్. రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ఇంగ్లీష్ అక్షరమాలలోని ఏ నుంచి జడ్ వరకు కుంభ కోణాలు చేశారు. పీసీసీ అంటే ప్రదేశ్ కరప్షన్ సెంటర్. మూడు రంగాల జెండాను పెట్టుకుని అవినీతి దందాలు చేస్తున్నారు. జాతీయ పతాకాన్ని అప్రతిష్ట పాలు చేస్తున్నా కాంగ్రెస్ తన జెండాను మార్చుకోవాలి అని జీవన్ రెడ్డి సూచించారు.

రేవంత్ ముఖ్య సలహాదారులు ఐదు వేల కోట్ల రూపాయలకు తక్కువ కమిషన్ తీసుకోవడం లేదు. కాంగ్రెస్ పార్టీకి చెందిన నలుగురు ఎమ్మెల్యేలు ఓ బిల్డర్‌ను బ్లాక్ మెయిల్ చేసేందుకు కోర్టులో పిల్ వేశారు. రేవంత్ అనుచరుడు ఫహీం ఖురేషి మరో నయీమ్‌గా మారారు. లియోనియా రిసార్ట్‌లో ఫహీమ్ ఖురేషి పది వేల కోట్ల రూపాయల కుంభకోణానికి పాల్పడ్డారు. శామీర్‌పేటలోని లియోనియా రిసార్ట్ 180 ఎకరాల్లో ఉంది. ఈ రిసార్ట్ బ్యాంకులకు రూ. 2200 కోట్ల బకాయిలు పడ్డది. ఈ ఏడాది ఫిబ్రవరి 25 నాడు ఈ లియోనియాను మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి రూ. 330 కోట్లకు కొట్టేశాడు. టెండర్లలో ఎవ్వరూ పాల్గొనకుండా ఫహీమ్ ఖురేషి ఒత్తిడి తెచ్చి రంజిత్ రెడ్డికి లియోనియా దక్కేలా చేశారు. ఇందులో బీజేపీ ఎంపీలకు కూడా వాటా ఉంది. అందుకే దీనిపై వారు మాట్లాడటం లేదు. లియోనియాకు డబ్బు బదిలీలో మనీ లాండరింగ్ కూడా ఉంది. ఈ వ్యవహారంపై విచారణ జరగాలి. విచారణ జరిపించకపోతే తప్పు జరిగినట్టే భావించాల్సి ఉంటుంది. బ్యాంకులకు ఇవ్వాల్సిన డబ్బులు ఎగ్గొట్టారు. కేంద్ర నిఘా సంస్థలు ఈ వ్యవహారంలో వెంటనే రంగంలోకి దిగాలి. ఈ కుంభకోణం ట్రైలర్ మాత్రమే. మరిన్ని కుంభకోణాలు త్వరలోనే బయటపెడుతామని జీవన్ రెడ్డి పేర్కొన్నారు.

# భారీగా దెబ్బతిన్న బ్లాక్ బాక్స్! డేటా సేకరించడం కష్టమే!

అహ్మదాబాద్:జూన్ 12న అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాదానికి గల కారణాలను రెండు దర్యాప్తు సంస్థలు అన్వేషిస్తున్నాయి. ఈ ప్రమాదంలో ఇప్పటి వరకు 279 మంది చనిపోయారు.ఇక ప్రమాదం జరిగిన 28 గంటల తర్వాత ప్రమాద స్థలి నుంచి బ్లాక్ బాక్స్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అయితే ఈ బ్లాక్ బాక్స్ భారీగా ధ్వంసం అయినట్లుగా జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. డేటా సేకరణ కోసం వాషింగ్టన్ డీసీకి పంపించాలని భావించారు. కానీ బ్లాక్ బాక్స్ భారీగా ధ్వంసం కావడంతో డేటా సేకరించడం కష్టమేనని దర్యాప్తు సంస్థలు భావిస్తున్నట్లు వర్గాల సమాచారం.ఇక బ్లాక్‌బాక్స్‌ను డీకోడ్ చేసేందుకు అమెరికాకు పంపించబోతున్నట్లు వస్తున్న వార్తలను కేంద్రం తోసిపుచ్చింది. టెక్నికల్, సెక్యూరిటీ అంశాలను పరిశీలించాకే బ్లాక్‌బాక్స్‌ను ఎక్కడికి పంపించాలనే విషయాన్ని ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో నిర్ణయిస్తుందని కేంద్రం స్పష్టత ఇచ్చింది. బ్లాక్ బాక్స్‌ను ఎక్కడి పంపించాలన్న నిర్ణయాన్ని దర్యాప్తు సంస్థలు ఇంకా నిర్ణయం తీసుకోలేదు.ఇదిలా ఉంటే ఎయిరిండియా విమాన ప్రమాదానికి విద్యుత్ వైఫల్యమే కారణంగా దర్యాప్తు సంస్థలు భావిస్తున్నాయి. విద్యుత్ అంతరాయం వల్లే విమానం కూలిపోయినట్లుగా భావిస్తున్నారు. ఇక ప్రత్యక్ష సాక్షులు కూడా ఇవే విషయాన్ని వెల్లడించారు. విమానం కూలిపోతున్నప్పుడు లైట్లు రెపరెపలాడుతున్నాయని అసాధారణ శబ్దం వినిపించిందని ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు. దీంతో విద్యుత్ సమస్య తలెత్తి కూలిపోయి ఉండొచ్చని దర్యాప్తు సంస్థలు ప్రాథమికంగా అంచనా వేస్తున్నాయి.విమానంలోని ప్రధాన విద్యుత్ వ్యవస్థలో లోపం తలెత్తి ఉంటుందని.. అందుకే విమానం కూలిపోయేటప్పుడు పెద్ద శబ్దం వచ్చినట్లుగా భావిస్తున్నారు. ప్రత్యక్ష సాక్షులు, ఏటీసీ ప్రకటనలు, శిథిలాలను పరిశీలించిన తర్వాత ప్రాథమిక పరీక్షల ద్వారా దర్యాప్తు సంస్థలు భావిస్తున్నాయి. విమానంలో విద్యుత్ లోపం ఉన్నట్లు సంకేతాలు కనిపించాయని.. ఏటీసీతో వెంటనే కమ్యూనికేషన్ తెలిపోయినట్లుగా వర్గాలు పేర్కొన్నాయి. అంతేకాకుండా శిథిలాల దగ్గర కూడా విద్యుత్ వ్యవస్థ దగ్గర సమస్యలు ఉన్నట్లుగా గుర్తించినట్లుగా వర్గాలు తెలిపాయి.



విమానం ఒక్కసారి ఎత్తు కోల్పోతున్న సమయంలో సమీపంలో ఉన్న ప్రజలు.. లైట్లు మిణుకుమిణుకుమంటు కనిపించాయని.. అసాధారణ శబ్దాలు వినిపించాయని చెప్పారు.ఈ ప్రమాదంపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో దర్యాప్తు నిర్వహిస్తోంది. మరోవైపు హెూం కార్యదర్శి అధ్యక్షతన ఒక ప్యానెల్ సమాంతర దర్యాప్తు నిర్వహిస్తోంది. ఇలా రెండు సంస్థలు దర్యాప్తు చేస్తున్నాయి. విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే పైలట్ మేడే కాల్ ఇచ్చాడు. కానీ అప్పటికే ఏటీసీతో విమానం సంబంధం కోల్పోయింది. దీనికంతటికి కారణం విద్యుత్ సమస్యనే కారణంగా దర్యాప్తు సంస్థలు భావిస్తున్నాయి. ప్రస్తుతం ఇంకా దర్యాప్తు కొనసాగుతోంది. మరోవైపు బ్లాక్ బాక్స్ బాగా దెబ్బతిన్నట్లుగా గుర్తించారు. దీన్ని ఓపెన్ చేసేందుకు అమెరికాకు పంపించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందుకోసం కేంద్రం నుంచి అనుమతులు రావల్సి ఉంటుంది.జూన్ 12న అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఎయిరిండియా విమానం బయల్దేరింది. కొన్ని సెకన్లలోనే హాస్టల్‌పై కూలిపోయింది. విమానంలో ఒక్కరు మినహా 241 మంది ప్రయాణికులు చనిపోయారు. ఇక హాస్టల్‌లో ఉన్న 34 మంది మెడికోలు చనిపోయారు. ఇక విమాన ప్రమాదంలో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ కూడా చనిపోయారు. కుమార్తెను చూసేందుకు లండన్ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

# ఆపరేషన్ సిందూర్‌పై పాక్ ఉప ప్రధాని సంచలన వ్యాఖ్యలు

ఇస్లామాబాద్:ఆపరేషన్ సిందూర్‌పై దాయాది దేశాధినేతలు ఒక్కొక్కరు నోరు విప్పుతున్నారు. తాజాగా పాకిస్థాన్ ఉప ప్రధాని ఇషాక్ దార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్‌లోని కీలకమైన వైమానిక స్థావరాలను భారతదేశం ధ్వంసం చేసిందని ఇషాక్ దార్ అంగీకరించారు.రావల్పిండిలోని నూర్ ఖాన్ ఎయిర్‌బేస్, షోరోకోట్ ఎయిర్‌బేస్ రెండు ధ్వంసం అయినట్లుగా ఉప ప్రధాని ఒప్పుకున్నారు. భారత్ జరిపిన దాడులతో భారీ నష్టం జరిగినట్లుగా ఒప్పుకున్నారు.పాకిస్థాన్ ఉప ప్రధాని ఇషాక్ దార్ తాజాగా ఓ టీవీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్‌కు భారీ నష్టం జరిగినట్లు ఒప్పుకున్నారు. భారత్ మెరుపు దాడులు చేసిందని.. దీంతో రెండు ఎయిర్‌బేస్‌లు పూర్తిగా ధ్వంసమైనట్లు చెప్పారు. ఆపరేషన్ సిందూర్ ప్రారంభం కాగానే.. సౌదీ యువరాజు ఫైసల్ బిన్ సల్మాన్ వ్యక్తిగతంగా తనతో మాట్లాడారని.. భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలను తగ్గించేందుకు భారత విదేశాంగ మంత్రి జైశంకర్‌తో మాట్లాడాలని యువరాజు సూచించినట్లు చెప్పారు. రెండు దేశాల మధ్య సమస్యలను తగ్గించేందుకు రియాద్ ముఖ్యమైన పాత్ర పోషించిందని.. అలాగే అమెరికా సైతం భారత్‌ను నిలువరించే ప్రయత్నం చేసిందని



చెప్పుకొచ్చారు. ఇక భారత్ దాడులను పాక్ ప్రధాని షరీఫ్ కూడా అంగీకరించారు. ఏప్రిల్ 22న పహల్గామ్ ఉగ్రదాడిలో 26 మంది చనిపోయారు. అనంతరం భారత్.. పాకిస్థాన్ పట్ల కఠిన వైఖరి తీసుకుంది. అనంతరం మే 7న భారత్.. పాకిస్థాన్‌పై ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. 100 మంది ఉగ్రవాదులు హతమయ్యారు. ఇక వైమానిక స్థావరాలు దెబ్బతిన్నాయి. దాయాది దేశం కాళ్ల బేరానికి రావడంతో కాల్పుల విరమణ జరిగింది.

# నాకు బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి మరణభయం ఉంది..



పాట్నా:రాష్ట్రీయ లోక్ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఉపేంద్ర కుష్వాహా తాజాగా సంచలన వ్యాఖ్యలు చేశారు. తనకు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి తనని చంపుతామని హెచ్చరికలు వచ్చాయని ఆయన వెల్లడించారు.గురువారం రాత్రి అనేక ఫోన్ కాల్స్, టెక్ట్స్ సందేశాల రూపంలో బెదిరింపులు వచ్చాయని చెప్పుకొచ్చారు. గత రాత్రి 8:52 గంటల నుండి 9:20 గంటల మధ్య రెండు వేర్వేరు మొబైల్ నంబర్ల నుండి నాకు ఫోన్ కాల్స్ వచ్చాయని.. అలాగే, 10 రోజుల్లో నిన్ను చంపుతాం అంటూ మెసేజ్ కూడా వచ్చిందని తెలిపారు. కాల్ చేసిన వ్యక్తి తనను లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ సభ్యుడిగా చెప్పుకున్నాడని ఉపేంద్ర కుష్వాహా మీడియాతో పేర్కొన్నారు.ఈ విషయాన్ని వెంటనే పోలీసులకు తెలియజేశానని, వారు దర్యాప్తు ప్రారంభించారని తెలిపారు. ఇది ఒక కీలక భద్రతా అంశం. నేను పాట్నా సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌కు సమాచారం ఇచ్చాను. వారు వెంటనే చర్యలు తీసుకుని, బాధ్యులను అరెస్టు చేయాలని కుష్వాహా డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా.. ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనపై స్పందించిన కుష్వాహా, ఈ పర్యటన ప్రాంతీయ అభివృద్ధికి మేలుచేసే విధంగా ఉండబోతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.సివాన్ ప్రజలు ప్రధానమంత్రి పర్యటన కోసం ఎదురు చూస్తున్నారు. మోదీ ఎక్కడికి వెళ్లినా ఆ ప్రాంతానికి ప్రత్యేక బహుమతులు ఇస్తున్నారు. ఎన్డీఏ పార్టీల మధ్య సీట్ల పంపకం సైతం సజావుగానే జరగనుందని తెలిపారు. జూన్ 20న ప్రధాని మోదీ బీహార్, ఒడిశా పర్యటన ప్రారంభించనుండగా.. జూన్ 21న ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించనున్నారు. శుక్రవారం నాడు సివాన్‌లో మోదీ పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసి ప్రారంభించనున్నారు. 'నమామి గంగే' ప్రాజెక్టు కింద రూ. 1,800 కోట్ల విలువైన ఆరు మలినజల శుద్ధి కేంద్రాలను ప్రారంభించనున్నారు ప్రధాని మోదీ. అలాగే, రూ. 3,000 కోట్ల విలువైన తాగునీటి సరఫరా, పారిశుధ్య, మలినజల శుద్ధి పథకాల శంకుస్థాపన చేయనున్నారు.

# క్లస్టర్ బాంబుతో ఇజ్రాయెల్ గజగజ




టెల్ అవీవ్ : ఇరాన్– ఇజ్రాయెల్ పరస్పర దాడుల నేపథ్యంలో పశ్చిమాసియా రణరంగంగా మారింది. యుద్ధం 8వ రోజుకి చేరగా.. తమ భూభాగంలోకి ఏకంగా క్లస్టర్ బాంబులను ఇరాన్ ప్రయోగించిందని ఇజ్రాయెల్ సంచలన ఆరోపణలు దిగింది. అసలు ఈ క్లస్టర్ బాంబు అంటే ఏమిటి? వాటి ప్రమాద తీవ్రత ఎంత?. ఆ బాంబును చూసి ఇజ్రాయెల్ ఎందుకు వణికిపోతోంది? వాటిని నిషేధం నిజంగానే అమల్లో ఉందా?.. క్లస్టర్ బాంబు అనేది ఒక క్షిపణిలా కనిపించినా.. అది గాలిలోనే తెరుచుకుని చిన్న చిన్న పేలుళ్లతో కూడిన సబ్‌మ్యూనిషన్లు అనే మినీ బాంబులను నేల మీదకు వదిలిపెడుతుంది. భూమిని తాకిన వెంటనే అవి పేలిపోతాయి. ఇరాన్ ఇజ్రాయెల్‌పై జరిపిన తాజా దాడిలో.. ఒక మిసైల్ సుమారు 7 కిలోమీటర్ల ఎత్తులో పేలి, దాని నుండి సుమారు 20 చిన్న పేలుడు పదార్థాలు సెంట్రల్ ఇజ్రాయెల్‌లో 8 కిలోమీటర్ల పరిధిలో పడ్డాయని సమాచారం. ఇప్పటి వరకు ఈ యుద్ధంలో ఇలాంటి బాంబులను వాడినట్టు నమోదైన ఇది మొట్టమొదటి కేసు.

### మోస్ట్ డేంజర్

ఇరాన్‌కు చెందిన ఇతర బాలిస్టిక్ క్షిపణుల కంటే ఈ క్లస్టర్ బాంబు క్షిపణులు భారీ ముప్పును కలిగిస్తాయనేది ఇజ్రాయెల్ వాదన. యుద్ధ తీవ్రతను పెంచేందుకు.. భారీ ముప్పును కలిగించేందుకు.. ఇరాన్ ఈ ఆయుధాలను ఉపయోగిస్తోందని, తమ పౌరులకు హాని కలిగించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపిస్తోంది.

### డ్యామేజ్ ఏంటంటే..

ఇజ్రాయెల్ వార్తా సంస్థ ప్రకారం.. జూన్ 19న జరిగింది ఇదే. క్షిపణుల్లో ఒకటి అజోర్‌లోని మధ్య పట్టణంలో ఓ నివాసాన్ని తాకినట్లు తెలుస్తోంది. అయితే, దీని కారణంగా పెద్దగా ప్రాణనష్టం జరగలేదని తెలుస్తోంది. కాగా.. ఇందులోని కొన్ని బాంబులు పేలకుండా ఉన్నాయని, ఇవి పౌరుల ప్రాణాలకు నష్టం కలిగిస్తాయని అధికారులు తెలిపారు. ఈక్రమంలో తమ ప్రజలను అప్రమత్తం చేసినట్లు వెల్లడించింది. అలాంటివాటిని గుర్తిస్తే పౌరులు వెంటనే అధికారులను అప్రమత్తం చేయాలని ప్రజలను హెచ్చరించింది.

### వివాదాలకు కేరాఫ్‌గా..

క్లస్టర్ బాంబులను వివాదాలకు కేంద్ర బిందువుగా చెబుతుంటారు. అందుకు కారణం.. ఇవి కలిగించే నష్టమే. సాధారణ క్షిపణి ఒక్క స్థలంలో పెద్ద పేలుడు కలిగిస్తుంది. కానీ క్లస్టర్ బాంబు చిన్న చిన్న మ్యూనిషన్లను పెద్ద ప్రాంతంలో చల్లుతుంది. ఒక్కో %ంబఎఎబఅ%అశీఅ% శక్తి తక్కువైనా, దాని విస్తృత పరిధి కారణంగా ఎక్కువమందికి ప్రమాదం కలిగించవచ్చు. మరీ ముఖ్యంగా జనావాసాలపై గనుక పడితే వీటి ప్రభావం తీవ్రంగా ఉంటుంది. వీటిలో కొన్నివాటిని భూమిని తాకిన వెంటనే పేలకుండా మిగిలిపోయే అవకాశం ఉంటుంది. ఇవి తరువాత కాలంలో కూడా పౌరులకు ప్రాణాంతకంగా మారే అవకాశం ఉంది. అందుకే వీటి వినియోగంపై ఆంక్షలున్నాయి. 2008లో జరిగిన క్లస్టర్ మ్యూనిషన్లపై సమావేశ ఒప్పందం ప్రకారం.. ఈ బాంబులను ఉపయోగించడం, నిల్వ చేయడం, అమ్మకాలు–కొనుగోలు జరపడం పూర్తిగా నిషేధించబడింది. ఈ ఒప్పందంపై 111 దేశాలు, 12 ఇతర ప్రాంతాలు ఈ ఒప్పందాన్ని అంగీకరించాయి. కానీ ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా, రష్యా, చైనా, భారత్ కూడా ఈ ఒప్పందంపై సంతకాలు చేయలేదు. 2023లో ఉక్రెయిన్ సంక్షోభంలో రష్యాకు వ్యతిరేకంగా క్లస్టర్ బాంబులను అందించిందనే ఆరోపణలు ఉన్నాయి. అలాగే రష్యా కూడా తమపై క్లస్టర్ బాంబులను ప్రయోగించిందని ఉక్రెయిన్ సైతం ఆరోపించింది.

## యోగాతో...ఆరోగ్యమే మహ భాగ్యం

హైదరాబాద్,ఆరోగ్యమే మహాభాగ్యం' అన్నారు పెద్దలు. శరీరం ఆరోగ్యంగా ఉంటేనే జీవితంలో సుఖం, సంతోషం, సమృద్ధి సాధ్యం. దీనికి ఆర్థిక ఆరోగ్యమూ ఎంతో ముఖ్యం. యోగా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. జూన్ 21, అంతర్జాతీయ యోగా దినోత్సవం నేపథ్యంలో ప్రపంచమంతా ఏటా ఈ కార్యక్రమంలో పాలుపంచుకుంటున్నారు. యోగాలో ఒక ఆసనాన్ని సాధన చేయాలంటే ఎంతో శ్రద్ధ, క్రమశిక్షణ అవసరం. ఒక్క రోజు సాధనతో పరిపూర్ణత రాదు. ఇది నిరంతర అభ్యాసం. ఇలా చేయడం వల్ల దీర్ఘకాలంలో గణనీయమైన ఆరోగ్యాన్ని సృష్టించవచ్చు. యోగా సాధనలో మనసు, శరీరం సమతుల్యంగా ఉండాలి. అప్పుడే ఆరోగ్యం సాధ్యం.యోగాలో ఒక ఆసనాన్ని పరిపూర్ణంగా చేయాలంటే ఓపిక అవసరం. ఒక్క రోజులోనే శరీరం ఆ ఆసనానికి అనువుగా మారదు. మనలో ఆత్మవిశ్వాసాన్ని పెంచేందుకు యోగా, ధ్యానం ఎంతో తోడ్పడతాయి. కష్టమైన ఆసనాల్ని వేసినప్పుడు వచ్చిన సంతృప్తి, మనల్ని ధైర్యవంతులుగా మారుస్తుంది. అదే విధంగా మన మీద మనకు విశ్వాసం అవసరం. యోగా ఒత్తిడిని తగ్గించడంలో సాయం చేస్తుంది. ప్రాణాయామం, ధ్యానం వంటివి మనసును ప్రశాంతంగా ఉంచుతాయి.

# విద్య,వైద్య రంగానికి హబ్ గా తీర్చిదిద్దుతాం..

బాన్సువాడ, జూన్ 20 : బాన్సువాడను విద్య, వైద్య రంగానికి హబ్ గా తీర్చిదిద్దుతామని రాష్ట్ర వ్యవసాయ సలహాదారుడు పోచారం శ్రీనివాస్ రెడ్డి సూచించారు. హైదరాబాద్ లోని తన కార్యాలయంలో బాన్సువాడ నియోజకవర్గం నసరుల్లాబాద్ మండలం దుర్కి గ్రామ శివారులో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ Bsc నర్సింగ్ కళాశాల భవన సముదాయ పనులపై సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ తో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ Bsc నర్సింగ్ కళాశాల భవన నిర్మాణ పనులను ఉద్దేశించి పోచారం మాట్లాడుతూ రూ. 40 కోట్లతో నిర్మిస్తున్న ప్రభుత్వ Bsc నర్సింగ్ కళాశాల భవన సముదాయ పనులను త్వరితగతిన పూర్తి చేసి త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ నర్సింగ్ కళాశాలను బాలికలు సద్వినియోగం చేసుకోవాలని, బాలికలకు విద్య ఎంతో అవసరం, విద్యతోనే సామాజికంగా, ఆర్థికంగా మార్పు వస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో కాంట్రాక్టర్, R&B అధికారులు మోహన్,



కాంట్రాక్టర్ గౌరి శంకర్, సిబ్బంది అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

# బనకచర్లను అడ్డుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం...



హైదరాబాద్: రాష్ట్ర ప్రజలను భారాస నేతలు తప్పుదోవ పట్టిస్తున్నారని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. ఏపీ సీఎం చంద్రబాబుతో రేవంత్‌రెడ్డి కుమ్మక్కయ్యారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం అక్రమాలపై ప్రజలు అవగాహన పెంచుకుంటున్నారన్నారు. ఇంటర్‌నెట్‌లో వెతికి మరీ తెలుసుకుంటున్నారని చెప్పారు."రాయలసీమ ఎత్తిపోతల, పోతిరెడ్డిపాడు పనులు జరుగుతున్నప్పుడు భారాస ప్రభుత్వం అభ్యంతరం చెప్పలేదు. బనకచర్లను అడ్డుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోంది. అవసరమైతే సుప్రీంకోర్టుకు కూడా వెళ్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెబుతున్నారు. కేంద్రం మన ఆలోచనలను పరిగణనలోకి తీసుకోకపోతే సర్వోన్నత న్యాయస్థానానికి వెళ్తామని ఆయన స్పష్టంగా చెప్పారు. తెలంగాణ సెంటిమెంట్ రేకెత్తించి తప్పుదోవ పట్టించేందుకు భారాస నేతలు ప్రయత్నిస్తున్నారు. బనకచర్ల అంశంపై తప్పనిసరిగా అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేస్తాం. ఏకగ్రీవ తీర్మానం చేస్తామంటేనే భారాస ఎంపీ ఇటీవల సమావేశం నుంచి వాకౌట్ చేశారు" అని చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు.

## సంపాదకీయం

శనివారం 21-06-2025

# జనారోగ్యంపై 'కొడవలి' వేటు

మన దేశంలో గిరిజనులను తీవ్రంగా ప్రభావితం చేస్తున్న పది ప్రధాన ఆరోగ్య సమస్యల్లో 'సికిల్‌సెల్ ఎనీమియా' ఒకటిగా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ గుర్తించింది. దేశీయ ఆదివాసీ జనాభాలో ఈ కేసులు పెరుగుతుండటం ఆందోళనకరం. నేడు 'ప్రవంచ సికిల్‌సెల్ ఎనీమియా అవగాహన దినం' సందర్భంగా...మన దేశంలో గిరిజనులను తీవ్రంగా ప్రభావితం చేస్తున్న పది ప్రధాన ఆరోగ్య సమస్యల్లో 'సికిల్‌సెల్ ఎనీమియా' ఒకటిగా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ గుర్తించింది. దేశీయ ఆదివాసీ జనాభాలో ఈ కేసులు పెరుగుతుండటం ఆందోళనకరం. నేడు 'ప్రపంచ సికిల్‌సెల్ ఎనీమియా అవగాహన దినం' సందర్భంగా...ప్రపంచవ్యాప్తంగా లక్షల మంది సికిల్‌సెల్ ఎనీమియాతో బాధ పడుతున్నట్లు అంచనా. సబ్ సహారన్ ఆఫ్రికా, భారత్, దక్షిణ ఐరోపా, పశ్చిమాసియా, ఉత్తర ఆఫ్రికాల్లో ఈ కేసులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ప్రపంచంలోని మొత్తం కేసుల్లో 14.5 శాతం భారత్‌లోనే ఉన్నాయి. ఇది ఎర్ర రక్తకణాలపై ప్రభావం చూపే జన్యుపరమైన రక్త సంబంధిత రుగ్మత. సాధారణ ఎర్ర రక్తకణాలు గుండ్రంగా ఉంటాయి. ఇవి శరీరంలోని అవయవాలకు ఆక్సిజన్ సరఫరా చేస్తాయి. జన్యుపరమైన కారణాలతో కొంతమంది ఎర్ర రక్తకణాలు కొడవలి ఆకారంలోకి మారతాయి. రక్త సరఫరాకు అడ్డంకులు సృష్టిస్తాయి. ఈ సమస్య ఉన్నవారి రక్తకణంలోని ఒక జన్యువు సికిల్‌సెల్‌గాను, మరొకటి మామూలుగా ఉంటే వారిని సికిల్‌సెల్ క్యారియర్లుగా వ్యవహరిస్తారు. భార్యాభర్తలు ఇద్దరికీ ఇలాంటి లక్షణాలు ఉంటే, వారికి పుట్టే పిల్లలకు రక్తకణంలోని రెండు జన్యువులు వంపు తిరిగి ఉంటాయి. వారికి పుట్టుకతోనే ఆరోగ్య సమస్యలు మొదలవుతాయి. బాధితుల్లో కొత్త ఎర్ర రక్తకణాలు వేగంగా ఉత్పత్తి కాకపోవడంతో రక్తహీనతకు గురవుతారు. ఆక్సిజన్ సరఫరా తగ్గుతుంది. చికిత్స తీసుకోకపోతే పరిస్థితి ప్రాణాంతకంగా మారుతుంది.

విస్తృత ప్రచారం అవసరం

దేశంలోని చాలా రాష్ట్రాల్లో వ్యాధి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో పరిశోధన కేంద్రం కూడా ఏర్పాటైంది. ఈ సమస్య గుజరాత్‌లో ఎక్కువగా ఉంది. వ్యాధి కట్టడిలోనూ గుజరాత్ ఆదర్శంగా నిలుస్తోంది. ఆ రాష్ట్రంలో 12 జిల్లాల్లో సికిల్‌సెల్ ఎనీమియా నియంత్రణ ప్రాజెక్టును చేపట్టారు. బాధితులకు మెరుగైన వైద్యం అందిస్తున్నారు. సికిల్‌సెల్ క్యారియర్ల మధ్య వివాహాలు జరగకుండా చైతన్యపరిచి మంచి ఫలితాలు సాధించారు. మధ్యప్రదేశ్‌లోని 55 జిల్లాల్లో 27 జిల్లాలను సికిల్‌సెల్ బెల్ట్‌గా పరిగణిస్తారు. గుజరాత్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్‌లలో నవజాత శిశువుల స్క్రీనింగ్ కార్యక్రమాలు చేపడుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ మన్యంలో పాఠశాలల్లో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఇటీవల వైద్య బృందం 4,09,672 మందికి స్క్రీనింగ్ పరీక్షలు చేయగా, 12,577 మంది సికిల్‌సెల్ క్యారియర్లుగా తేలింది. 1488 మంది వ్యాధిబారిన పడినట్లు నిర్ధారించారు. వ్యాధి తీవ్రత 50 శాతానికి మించి ఉన్నవారికి ప్రభుత్వం నెలకు రూ.10 వేలు పింఛన్‌గా అందిస్తోంది. ఆంధ్రా విశ్వవిద్యాలయంలోని హ్యూమన్ జెనెటిక్స్ విభాగం జరిపిన పలు సర్వేల్లో ఏజెన్సీల్లో నివసిస్తున్న గిరిజనేతరుల్లోనూ వ్యాధి లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. 2047 సంవత్సరం నాటికి ఈ వ్యాధిని నివారించాలనే లక్ష్యంతో జాతీయ సికిల్‌సెల్ ఎనీమియా నివారణ మిషన్‌ను 2023 కేంద్ర బడ్జెట్‌లో ప్రవేశపెట్టారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించడం, గిరిజన ప్రాంతాల్లో అవగాహన కల్పించడం, మూడేళ్లలో ఏడు కోట్ల మంది 40 ఏళ్ల వయసులోపు వారికి స్క్రీనింగ్ పరీక్షలు చేయడమే మిషన్ లక్ష్యం. ఒడిశా, ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రల్లోని గిరిజన ప్రాంతాల్లో ఎక్కువమంది రోగులున్నారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేక ఆరోగ్య సంరక్షణ, సౌకర్యాలు కొరవడటం సమస్యగా మారుతోంది. వ్యాధి నివారణపై శిక్షణ పొందిన సిబ్బంది కూడా సరిపడినంతగా ఉండట్లేదు. నవజాత శిశువుల స్క్రీనింగ్ అన్ని ప్రాంతాల్లో సక్రమంగా జరగట్లేదు. మందుల ఖర్చులు, ఆరోగ్య పరీక్షలు ఆర్థిక భారంగా మారుతున్నాయి.

నివారణ కోసం...

ఈ వ్యాధిపై గిరిజన ప్రాంతాల్లో విస్తృత రీతిలో నిరంతరం అవగాహన సదస్సులు నిర్వహించాలి. సికిల్‌సెల్ క్యారియర్ల మధ్య వివాహాలు జరగకుండా నిరోధించాలి. మన్యం ప్రాంతంలో చిన్నారులందరికీ ఆరోగ్య పరీక్షలు చేయించాలి. వ్యాధి సంక్రమించకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేయాలి. బాధితుల్లో ధైర్యం నింపాలి. సంచార యూనిట్లు ఏర్పాటు చేసి మారుమూల ప్రాంతాల్లోనూ పరీక్షలు నిర్వహించాలి. వ్యాధి నిర్ధారణ జరిగితే మెరుగైన వైద్యం సక్రమంగా అందించాలి. గతంలో పోలియో, హెచ్ఐవీ నిరోధానికి నిర్వహించిన ప్రచారాల తరహాలో విస్తృత రీతిలో అవగాహన కల్పించాలి. నవజాత శిశువుల స్క్రీనింగ్ పెంచాలి. అందుబాటులో మందులు ఉంచాలి. వైద్య పరిశోధనలకు మరిన్ని వనరులు కేటాయించాలి. సాంకేతికత, అవగాహన, ఆరోగ్య సంరక్షణ విధానాల ద్వారా వ్యాధిని పూర్తిగా నివారించడమే ప్రభుత్వాల ధ్యేయం కావాలి. అందుకోసం రాష్ట్రాల్లో ప్రత్యేక ప్రాజెక్టులు అమలు చేయాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయ కృషి ద్వారా వ్యాధికి సమర్థంగా అడ్డుకట్ట వేయడం సాధ్యమేనన్న సంగతి గుర్తించాలి.

# బనకచర్లపై బిఆర్ఎస్ రాజకీయ చిచ్చు !




హైదరాబాద్,బనకచర్ల ప్రాజెక్టుపై రాజకీయ నాయకులు మళ్ళీ వివాదం రేపి పబ్బం గడుపుకునే ప్రయత్నంలో ఉన్నారు. గతంలో ఉమ్మడి ఎపిలో బాబ్లీ గొడవ చేశారు. అది సమిసిపోయింది. తాజాగా బనకచర్ల దొరికింది. ఇప్పుడు దీనిని సాగదీస్తూ, సమస్యలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేసే యత్నాలు మొదలయ్యాయి. రాయల సీమకు నీరందిస్తామని జగన్‌తో లంచ్ మీటింగ్‌లో ప్రకటించిన కెసిఆర్ పార్టీ బిఆర్ఎస్ ఇప్పుడు బనకచర్లపై విమర్శలు అందుకుంది. బనకచర్ల అనేది వృధాగా పోతున్న గోదావరి నీళ్లను మాత్రమే నిల్వచేసే ప్రాజెక్ట్. దీని నిర్మాణంతో ఎగువన ఉన్న తెలంగాణలో నీటిని తరలించుకునే అవకాశం లేదు. పైన నీళ్లు లేకుంటే గోదావరి ఎండిపోతుంది. అప్పుడు బనకచర్లకు నీరు వెళ్లడం అసాధ్యం కూడా. మొన్నటి వరకు తెలుగు రాష్ట్రాలు ఒక్కటే. ఉమ్మడి ఎపి అయినా, విడిపోయి రెండు రాష్ట్రాలుగా వేరయినా రైతులు, ప్రజలు ప్రయోజనాలు పొందాల్సిందే. నిజానికి గోదావరిలో ఏటా వందల టిఎంసిల నీరు వృధాగా సముద్రంలో కలుస్తున్నాయి. ఇలా మనం ఏటా వర్షాకాలంలో వృధాగా పోతున్న నీటిని చూసి చింతిస్తున్నాం తప్ప అడ్డుకట్ట వేయడానికి ప్రయత్నించడం లేదు. కాళేశ్వరం పేరుతో కట్టిన ఆనకట్ట వృధాగా పోయింది. కేవలం కమిషన్ల కోసం కట్టి ఇంజనీరింగ్ ప్రతిభ అని చెప్పుకున్న కెసిఆర్, ఇప్పుడేమో, దానిపై విచారణ సాగగానే మాటమారుస్తున్నారు. కాళేశ్వరం సరిగా కట్టివుంటే, సరైన ప్రాంతంలో డిజైన్ చేసివుంటే గోదావరి నీళ్లను మనం ఉపయోగించుకునే వీలుండేది. కానీ ఇప్పుడది తెల్ల ఏనుగులా మారింది. రాజకీయ నాయకులు తమ పబ్బం గడుపుకోవడానికి ఎలా వ్యవహరిస్తారన్న దానికి కాళేశ్వరం ప్రత్యేక ఉదాహరణ. బిబిసి సహా అనేక చోట్ల దీనిని మానవనిర్మిత అద్భుతంగా ప్రచారం చేసుకున్న కెసిఆర్, ఆయన బృందం ఇప్పుడు కేబినేట్ అనుమతితోనే నిర్మించామని మాటమార్చారు. నిజానికి గోదావరి జలాలను ఎంతగా వినియోగించుకుంటే అంతమంచిది. చుక్కనీరు కూడా సముద్రంలో కలిసి పోకుండా తెలంగాణ, ఎపిలు ఉమ్మడిగా ప్రణాళికలు సిద్దం చేయాలి. అంతేగాని వివాదాలు కాదు. దీనికోసం కేంద్రాన్ని కలవడం, సుప్రీం కోర్టుకు వెళ్లడం సరికాదు. ఈ వ్యవహారంలో చిచ్చురాజేసి చలి కాచుకోవాలన్న బిఆర్ఎస్ ప్రయత్నాలు కూడా ఆమోద యోగ్యం కాదు. నిజానికి బనకచర్ల అనుసంధానంపై రగడను బీఆర్ఎస్ పార్టీ ప్రముఖంగా లేవదీసింది. ఆ పార్టీ అధికార మీడియాలో ప్రతిరోజూ వరసబెట్టి ఈ అనుసంధానానికి, ఆంధ్రప్రదేశ్‌కు వ్యతిరేక కథనాలు వస్తున్నాయి. ఎగువ రాష్ట్రమైన తెలంగాణ ఉపయోగించుకోగా మిగిలిన నీరే కిందకు పోతుందనే స్పృహ లేకుండా బీఆర్ఎస్ తీరు ఉంది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ కుంభకోణం బీఆర్ఎస్ పార్టీ మెడకు చుట్టుకోవడంతో దాన్ని పక్కదారి పట్టించేందుకు బనకచర్ల వ్యవహారాన్ని బిఆర్ఎస్ ప్రచారం చేసుకుంటోంది. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీలో పిల్లర్లు దెబ్బ తిని నీటిని నిల్వ చేయక పోవడానికి, అవినీతిపై కమిషన్ విచారణ చేయడంతో వ్యూహాత్మకంగా బిఆర్ఎస్ బరితెగింపు రాజకీయం చేస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై న్యాయ విచారణ జరుపుతున్న ఘోష్ కమిషన్ ముందు కేసీఆర్ విచారణకు హాజరై ప్రశ్నలకు సమాధానమిచ్చారు. అయితే కాళేశ్వరం ఎపిసోడ్ నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు బీఆర్ఎస్ పార్టీ బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టుపై దుమ్మెత్తి పోస్తోందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇలాంటి వాదనలు తీసుకుని వచ్చే వారి రాజకీయ దురుద్దేశ్యాలను ఎండగట్టాల్సిందే. ఈ నీటిని పూర్తిగా ఎలా నిలువరించాలో ఆలోచన చేయాలి. తెలంగాణ వాడుకోగా మిగిలిన నీళ్లు కిందకు వస్తేనే ఆంధ్రప్రదేశ్ ఉపయోగించుకొనే వీలుంటుంది. అప్పుడే బనకచర్లకు నీరు వెళుతుంది. అంతే తప్ప సముద్రంలోకి వెళ్లదు. ఈ ఆలోచన మంచిదే. మహారాష్ట్ర కట్టిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తితేనే శ్రీరామ్‌సాగర్‌కు నీళ్లు వస్తున్నాయి. గోదావరి నదిలో దిగువ రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ తన వాటాకు మించి ప్రాజెక్టులు కట్టుకొంటే పై నుంచి అవసరమైన మేరకు నీళ్లు రాకుంటే అవి వృధాగా ఉండాల్సిందే. బనకచర్ల ద్వారా వృధానీటి తరలింపు సఫలమైతే నదుల అనుసంధానానికి అడుగు వేసిన వారం అవుతాం. కేంద్రం కూడా ఇలాంటి సమస్యలపై సత్వరంగా స్పందించి, ఇరు రాష్ట్రాల ప్రతినిధులతో చర్చించాలి. అంతేతప్ప తాత్సారం చేయరాదు. చోద్యం చూడరాదు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నీటివాటాల వివాదం అపరిష్కృతంగా ఉంది. కృష్ణా విషయంలో తరచూ కీచులాటలు తప్పడం లేదు. ఒకవేళ బనకచర్ల సాకారం అయితే కృష్ణాపై ఒత్తిడి తగ్గుతుంది. గోదావరి ట్రిబ్యునల్ కేటాయించిన 1486.85 టీఎంసీల్లో 957.85 టీఎంసీల నీళ్లు తమవని తెలంగాణ చెబుతున్నది. ఇదే నిజమైతే...ఈ నీటిని నిలవచేయడానికి అవసరమైన ప్రాజెక్టులు నిర్మించాలి. ట్రిబ్యునల్ నియామకమైతే దాని ముందు తన వాటాను గురించి వాదించవచ్చు. ప్రస్తుతం తను చెబుతున్న వాటా మేరకు కొన్ని ప్రాజెక్టుల డీపీఆర్‌లు ఆమోదం కోసం కృషి చేస్తున్నది. తెలంగాణ కూడా గోదావరి జలాలను ఒడిసిపట్టే ప్రయత్నం చేయడంలో తప్పు లేదు. అయితే దిగువ రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ ఎన్ని ప్రాజెక్టులు కట్టుకున్నా, ఇక్కడి నుంచి నీరు కిందికి పోతేనే వారి ప్రయత్నం ఫలిస్తుంది. ఎగువ రాష్ట్రాలు నిర్మించే ప్రాజెక్టులపై సాధారణంగా దిగువ రాష్ట్రాలు అభ్యంతరాలు చెబుతాయి. ఎందుకంటే దిగువన ఉన్న తమకు నీరు వస్తుందో రాదో అన్న భయం ఉంటుంది. ఆల్మట్టి, నారాయణపూర్ , బాబ్లీ ప్రాజెక్టులు ఇలా కట్టినవే. దీంతో కృష్ణా గోదవరుల్లో సకాలంలో నీరు రావడం లేదు. ఎగువన భారీ వర్షాలు పడి, ప్రాజెక్టుల్లోకి నీరు వస్తేనే కృష్ణమ్మ గలగలలు వినిపిస్తాయి. ఇదే క్రమంలో తెలంగాణ ప్రాజెక్టులు కడితే ఎపికి నష్టం తప్ప, ఎపి ప్రాజెక్టులు కడితే తెలంగాణకు నష్టం ఉండబోదు. పోలవరం వల్ల వరద ముంపు ఉందంటున్న తెలంగాణ నేతలు, దానినీరు మరింతగా రాకుండా కిందకు వెళితే మంచిదే అన్న విషయం ఆలోచించడం లేదు. దిగువన ఉండే ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టులు కట్టుకొంటే ఎగువన వుండే తెలంగాణకు ఏ విధంగా నష్టం కలుగుతుందో బిఆర్ఎస్ నేత హరీష్ రావు చెప్పాలి.

# బావ మాట బంగారు బాట!

హైదరాబాద్,ఈ రేసు కేసులో కేటీఆర్ ఏసీబీ విచారణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ అరెస్ట్ అవుతారన్న ప్రచారం విస్తృతంగా సాగింది. జైలుకు వెళ్లాల్సి వచ్చినా రెడీ అంటూ కేటీఆర్ స్వయంగా ప్రకటించడంతో ఉత్కంఠ నెలకొంది. ఒకవైపు కేసీఆర్ ఫాంహౌస్ విడిచి రావడం లేదు. కవిత దాదాపు వేరు కుంపటి పెట్టుకున్నారు. కేటీఆర్‌తో హరీష్‌రావుకి విభేదాలున్నట్లు పెద్దఎత్తున ప్రచారం జరిగింది. ఇలాంటి పరిస్థితుల్లో కేటీఆర్ అరెస్ట్ అయితే పరిస్థితేంటని గులాబీశ్రేణుల్లో గుబులు కనిపించింది. అయితే తనపై ప్రచారాలకు ఫుల్‌స్టాప్ పెడుతూ కేటీఆర్ విచారణ సందర్భంగా హరీష్‌రావు ఆయన వెన్నంటే ఉండటం ఆసక్తికరంగా మారింది.

కేటీఆర్‌ని 8 గంటలు విచారించిన ఏసీబీ

ఫార్ములా-ఈ రేస్ కేసులో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఏసీబీ అధికారులు ఎనిమిది గంటలపాటు సుదీర్ఘ విచారణ చేశారు. ఈ సారి ప్రధానంగా ఫార్ములా-ఈ ఆపరేషన్స్ సంస్థతో పరిచయం, రేసు నిర్వహణ కోసం జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలు, నిధుల చెల్లింపుల వంటి అంశాలపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఇదే కేసులో కేటీఆర్‌ను జనవరి 9న ఏసీబీ అధికారులు విచారించారు. అనంతరం%ఔ% రేస్ నిర్వహణపై ఎఫ్ఈవో ప్రతినిధులను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రెండుసార్లు విచారించారు. వారి నుంచి సేకరించిన సమాచారం ఆధారంగానే కేటీఆర్‌పై విచారణ సాగినట్లు తెలుస్తోంది. కేటీఆర్ వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్న అధికారులు అవసరమైతే మరోసారి పిలుస్తామని చెప్పి పంపించి వేశారు.

సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ అప్పగింతకు అంగీకరించిన కేటీఆర్

విచారణలో 2021 జనవరి నుంచి 2023 డిసెంబరు వరకు వాడిన సెల్‌ఫోన్‌తోపాటు ల్యాప్‌టాప్‌లను తమకు అప్పగించాలని అధికారులు కోరగా%ఔ% కేటీఆర్ అంగీకరించినట్లు సమాచారం. దాదాపు ఎనిమిది గంటలపాటు రెండు, మూడు విడతలుగా ఆయనను ప్రశ్నించారు. మధ్యలో భోజన విరామమిచ్చారు. విచారణ తతంగం మొత్తాన్నీ వీడియో చిత్రీకరించారు. ఆయన చెప్పిన వివరాలను నమోదు చేసి సంతకం తీసుకున్న తర్వాత విచారణ ముగిసిందని, అవసరమైతే మరోమారు హాజరుకావాల్సి ఉంటుందని చెప్పి కేటీఆర్‌ను పంపించారు. అక్కడ నుంచి నేరుగా కేటీఆర్ బీఆర్ఎస్ కార్యాలయానికి చేరుకున్నారు.

మహా అయితే అరెస్ట్ చేస్తారని వ్యాఖ్యానించిన కేటీఆర్

ఈ విచారణ సందర్భంగా కేటీఆర్ అరెస్ట్ అవుతారన్న ప్రచారం విస్తృతంగా జరిగింది. ఒకవైపు కేటీఆర్ అరెస్ట్ అనే వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అయితే.. స్వయంగా కేటీఆరే తన అరెస్టుపై లీకులు ఇవ్వడం మరింత ఉత్కంఠ రేపింది.ఏసీబీ విచారణకు హాజరవుతూ ఆసక్తికర కామెంట్స్ చేశారాయన. ఎన్నిసార్లైనా విచారణకు వస్తానంటూనే.. మహా అయితే అరెస్ట్ చేస్తారంటూ.. మళ్లీ జైలుకెళ్లాల్సి వచ్చినా రెడీ అని వ్యాఖ్యానించారాయన. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అరెస్ట్ అయితే ఎట్టా? అసలే కేసీఆర్ ఆరోగ్యం బాలేదు. ఫ్యామిలీలో సఖ్యత లేదు. గులాబీ బాస్ ఫాంహౌజ్ విడిచిరావట్లేదు. ఎమ్మెల్సీ కవిత కారు దిగేశారు. అటు కేసీఆర్ రాక.. కవిత లేక.. కేటీఆర్ జైలు కెళితే ఏంటి పరిస్థితి? గులాబీ దండులో తీవ్ర ఆందోళన కనిపించింది.

విభేదాల ప్రచారానికి చెక్ పెట్టేలా వ్యవహరించిన హరీష్‌రావు

అయితే దానికి సమాధానంగా అన్నట్లు ట్రబుల్ షూటర్‌గా పేరున్న మాజీ మంత్రి హరీష్‌రావు వ్యవహరించారు. కేటీఆర్, హరీష్‌రావులకు విభేదాలున్నాయని వార్తలు వస్తున్న నేపథ్యంలో దానికి చెక్ పెట్టేలా హరీష్‌రావు వ్యవహరిస్తున్నారు. కవిత ఎపిసోడ్ తో కేసీఆర్ కుటుంబంలో మొదలైన రాజకీయ



విభేదాలు, బిఆర్ఎస్ లో మొదలైన రాజకీయ ఆధిపత్య పోరుపై పెద్ద ఎత్తున్న ప్రచారం జరిగింది. అందులో భాగంగా కేసీఆర్ దేవుడే కానీ ఆయన చుట్టూ కొన్ని దెయ్యాలు చేరాయి అంటూ కవిత చేసిన వ్యాఖ్యలు కేటీఆర్, హరీష్ లను ఉద్దేశించినవే అన్న ప్రచారం తెలంగాణ రాజకీయాలలో గట్టిగా జరిగింది.

హరీష్ రావుకి నోటీసులపై స్పందించని కవిత

కుటుంబ విభేదాలపై ప్రచారాన్ని బలపరుస్తూ కవిత కూడా తన జాగృతి సంస్థతో సొంత కార్యక్రమాలు నిర్వహించుకుంటూ దూకుడు ప్రదర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్‌కు కవిత మెల్లిమెల్లిగా దూరమవుతున్నట్లు కనిపిస్తున్నారు. అయితే అటు కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్, హరీష్‌లకు కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణకు నోటీసివ్వడంతో తన తండ్రికి మద్దతుగా గళం వినిపించిన కవిత హరీష్ విషయంలో మౌనంగా ఉండిపోయింది. అలాగే ఇటు ఫార్ములా ఈ కేసులో కేటీఆర్‌ను ఏసీబీ విచారించడంపైనా కవిత రియాక్ట్ కాలేదు. దీనితో కవిత కు ఇప్పుడు అన్న కేటీఆర్, మామ హరీష్ ఇద్దరు కూడా రాజకీయ ప్రత్యర్థులుగా మారిపోయారా అన్న అనుమానాలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో నేడు ఏసీబీ విచారణకు హాజరయిన కేటీఆర్ మీడియా ముందుకు వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం పై విమర్శలతో విరుచుకుపడ్డారు.

కేటీఆర్‌కు మద్దతుగా నిలిచిన హరీష్‌రావు

అయితే ఆ సమయంలో కేటీఆర్‌కు మద్దతుగా హరీష్‌రావు ఉండటం ప్రాధాన్యత సంతరించుకుంది. గతంలో కేసీఆర్ బీఆర్ఎస్ పగ్గాలను కేటీఆర్ చేతిలో పెడితే హరీష్ పార్టీని రెండు ముక్కలుగా చీలుస్తారని, కేటీఆర్ ఎదుగుదలకు హరీష్ అడ్డగోడలా నిలబడ్డారని ప్రత్యర్థులు విమర్శలు గుప్పించారు. అయితే ఆ ఆరోపణలన్నిటి సమాధానంగా హరీష్ పార్టీ పరంగా నాయకత్వ మార్పు నుంచి మరే ఇతర మార్పులకైనా కేసీఆర్ సిద్ధపడితే అందుకు తన పూర్తి మద్దతు ఉంటుందని, అది కేటీఆర్ నాయకత్వమైన తానూ స్వాగతిస్తానని గతంలోనే ప్రకటించారు. దానికి తగ్గట్లే తర్వాత కేటీఆర్, హరీష్‌రావులు వరుసగా భేటీ అయి తమ విభేదాలు లేవని స్పష్టం చేసే ప్రయత్నం చేశారు. తాజాగా కేటీఆర్ ఏసీబీ విచారణకు హాజరైనప్పుడు హరీష్‌రావు ఆయన వెన్నంటే ఉండటంతో గులాబీశ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.

హరీష్‌రావుకి సముచిత ప్రాధాన్యత ఇస్తున్న కేటీఆర్

అటు కేటీఆర్ కూడా తన తండ్రి కేసీఆర్ తో సమానంగా హరీష్ కు ప్రాముఖ్యత ఇస్తున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అందులో భాగంగానే కాళేశ్వరం వివాదంపై విచారణకు నోటీసులు ఇచ్చినప్పుడు కేసీఆర్ తో పటు హరీష్‌ను కూడా సమర్థిస్తూ రేవంత్ సర్కార్ పై కేటీఆర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు కేటీఆర్. మొత్తానికి బీఆర్ఎస్‌లో కవిత రేపిన చిచ్చు హరీష్, కేటీఆర్ లను దగ్గర చేసిందా? అన్న చర్చ మొదలైందిప్పుడు.

# పోలీసు విధులకు ఆటంకం కలిగిచిన అంబటి

గుంటూరు, వైకాపా నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు పై సత్తెనపల్లి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. మాజీ సీఎం జగన్ పర్యటన సందర్భంగా కొర్రపాడు వద్ద అంబటి తన సోదరుడు మురళితో కలిసి పోలీస్ ఆంక్షలను ధిక్కరించారు. బారికేడ్లు తోసేసి పోలీసులతో వాగ్వాదానికి దిగారు. వారించిన పోలీసులను కూడా అంబటి నెట్టివేశారు. విధులకు ఆటంకం కలిగించి దాడి చేశారంటూ వివిధ సెక్షన్ల కింద పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. జగన్ బుధవారం సత్తెనపల్లి మండలం రెంటపాళ్లలో వైకాపా కార్యకర్త నాగమల్లేశ్వరరావు విగ్రహావిష్కరణకు హాజరయ్యారు. ఆయన ర్యాలీ గుంటూరు, నల్లపాడు, మేడికొండూరు మీదుగా పల్నాడు జిల్లా వరకు సాగింది. గుంటూరు, పల్నాడు జిల్లాల సరిహద్దు ప్రాంతం కొర్రపాడు శివారులోని ఒక పెట్రోల్ బంకు వద్ద పోలీసులు చెక్‌పోస్టు ఏర్పాటుచేశారు. జగన్ వాహనంతో పాటు మరికొన్ని ముందుకెళ్లగా.. రద్దీని నియంత్రించేందుకు వెనుక ఉన్న వాహనాలను పోలీసులు ఆపారు. మాజీమంత్రి అంబటి రాంబాబు అక్కడికి వచ్చి.. వాహనాలను ఎందుకు ఆపారని, వెంటనే పంపాలని పోలీసులతో వాదనకు దిగారు. వాహనాల సంఖ్య ఎక్కువగా ఉందని, ఏటుకూరు వద్ద ప్రమాదంలో ఓ వ్యక్తి చనిపోయినందున జగన్ కాన్వాయ్‌కు ఇబ్బంది కలగకూడదనే వాహనాల్ని ఆపామని పోలీసులు వివరించినా వినిపించుకోలేదు. పోలీసులతో వాగ్వాదానికి దిగిన అంబటి.. ఓ దశలో తన సోదరుడు మురళితో కలిసి రోడ్డుపై అడ్డుగా పెట్టిన బారికేడ్లు నెట్టేశారు. అడ్డుచెప్పిన పోలీసులపై నోరు పారేసుకుని వారిపైకి దూసుకెళ్లారు. జగన్ రెంటపాళ్ల పర్యటనలో నిబంధనలు ఉల్లంఘించడంపై సత్తెనపల్లి పట్టణ పోలీసులు కేసులు నమోదు చేశారు. వైకాపా నేత, నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, సత్తెనపల్లి వైకాపా ఇన్‌ఛార్జ్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డితో పాటు మరికొందరిపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే వివాదాస్పద ప్లకార్డులు ప్రదర్శించిన వైకాపా కార్యకర్తను పోలీసులు అరెస్టు చేశారు. పల్నాడు జిల్లా రెంటపాళ్లలో జగన్ పర్యటనలో రవితేజ అనే కార్యకర్త వీటిని ప్రదర్శించాడు. దీంతో 88 తాళ్లూరు గ్రామానికి చెందిన అతడిని అరెస్టు చేశారు. సత్తెనపల్లి తెదేపా నాయకులు, తెలుగు మహిళల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. నకరికల్లు పోలీసు స్టేషన్‌లో పోలీసులు రవితేజను ప్రశ్నిస్తున్నారు. వైకాపా అధ్యక్షుడు జగన్ బుధవారం పల్నాడు జిల్లా సత్తెనపల్లె నియోజకవర్గంలోని రెంటపాళ్లకు వెళ్లినప్పుడు వైకాపా శ్రేణులు ప్రజలను భీతావహుల్ని చేసే విధంగా రెచ్చగొట్టే వ్యాఖ్యలతో ప్లెక్సీలను ప్రదర్శించారు. నినాదాలు చేశారు. జగన్ ఇటీవల రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లినా వైకాపా శ్రేణులు ఇలాగే చెలరేగిపోతున్నాయి.

# నిధులు జమ కాకుంటే అధికారులను కలవండి

హైదరాబాద్, రైతు భరోసా నిధులు జమకాని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హత ఉండి.. బ్యాంకు అంకౌంట్లలో డబ్బులు పడని రైతులు స్థానిక వ్యవసాయ అధికారులను సంప్రదించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. మరోవైపు.. రాష్ట్రంలో కొత్తగా భూముల యాజమాన్యం పొందిన రైతులకు కూడా రైతు భరోసాకు అర్హులవుతారని ప్రభుత్వం తెలిపిన విషయం విధితమే. జూన్ 5వ తేదీ వరకు భూమి యాజమాన్య హక్కులు పొందిన రైతులు కూడా ఈ పథకానికి అర్హులుగా ప్రభుత్వం పరిగణిస్తుంది. క్రమంలో ప్రభుత్వం నిర్ణయించిన జూన్ 20వ తేదీ వరకు రైతు భరోసా పథకం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకోవాలని భావించిన వారు సంబంధిత ఏఈవో దగ్గరకు వెళ్లి అవసరమైన డాక్యుమెంట్లు సమర్పించాల్సి ఉంటుందనీ తెలిపారు.. జూన్ 20వ తేదీ వరకు అలా అప్లయ్ చేసుకున్న వారికి మాత్రమే రైతు భరోసా సాయం అందుతుందని అధికారులు తెలిపారు. తెలంగాణ రైతాంగానికి రాష్ట్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. రైతు భరోసా నిధులను విడుదల చేస్తోంది. తాజాగా మరో రూ. 1189.43 కోట్లను విడుదల చేసింది. ఐదు ఎకరాల వరకు రైతు భరోసా నిధులు జమ చేసిన సర్కార్.. గురువారం నాడు మరికొంత మంది రైతుల ఖాతాల్లో నిధులు జమ చేసింది. అధికారిక సమాచారం ప్రకారం.. గురువారం నాడు 4,43,167 మంది రైతుల ఖాతాల్లోకి రైతు భరోసా నిధులు జమ చేసింది. ఇప్పటి వరకు 62.47 లక్షల మంది రైతుల ఖతాల్లో రూ. 6404.7 కోట్లను ప్రభుత్వం జమ చేసింది. ఇక భూమి పరంగా చూసుకుంటే.. 106 లక్షల ఎకరాకు పంట సహాయం అందించినట్లు ప్రభుత్వం ప్రకటించింది.

# కేసీఆర్‌కు కష్టాలే?

హైదరాబాద్,నాలుగు సార్లు పిలిచారు. గంటల తరబడి సుదీర్ఘంగా విచారించారు. ఫోన్ ట్యాపింగ్ ఎలా చేశారు? ఎందుకు చేశారు? ఎవరు చెబితే చేశారు? ఎవరి అనుమతి తీసుకున్నారు? ఎవరెవరి ఫోన్లు ట్యాప్ చేశారు? ఇలా రకరకాల ప్రశ్నలు అడిగారు. సిట్ ఎంతగా గుచ్చిగుచ్చి ఎంక్వైరీ చేస్తున్నా.. %ూ×దీ% మాజీ చీఫ్ ప్రభాకర్ రావు మాత్రం గమ్మునుంటున్నారట. తెలీదు.. గుర్తులేదు.. కాదు.. అవును.. ఇలా పొడిపొడి మాటలే మాట్లాడుతున్నారట. ఇక, ఇలా అయితే లాభం లేదని అనుకుంటున్న సిట్.. ప్రభాకర్‌రావును కస్టడీకి తీసుకోవాలని భావిస్తోంది. అరెస్ట్ దిశగా అడుగులు వేస్తోంది.

సుప్రీంకోర్టుకు సిట్?

ప్రభాకర్‌రావును అరెస్ట్ చేయవద్దంటూ సుప్రీంకోర్టు రక్షణ ఉంది. ఆ కండిషన్ మేరకే ప్రభాకర్‌రావును అమెరికా నుంచి ఇండియాకు రప్పించింది కోర్టు. అందుకే ఇప్పటి వరకూ జరిగిన విచారణలో కింగ్ పిన్ సహకరించట్లేదనే కారణంతో ఆయన్ను అరెస్ట్ చేసేందుకు అనుమతి ఇవ్వాల్సిందిగా సుప్రీంకోర్టును సిట్ ఆశ్రయించనున్నట్టు సమాచాచరం. అంతేకాదు కస్టోడియల్ విచారణ కోసం నాంపల్లి కోర్టులోనూ పిటిషన్ వేసే అవకాశం కనిపిస్తోంది. అదే జరిగితే.. ప్రభాకర్‌రావును అరెస్ట్ చేస్తే.. కస్టడీకి తీసుకుంటే.. ఇక నిజాలు రాబట్టడం మరింత ఈజీ అవుతుంది. అప్పుడిక ఆనాటి సీఎం కేసీఆర్ మెడకు ఫోన్ ట్యాపింగ్ ఉచ్చు బిగుసుకునే అవకాశం ఎక్కువగా ఉందంటున్నారు. కేసీఆర్ ఆదేశాల మేరకే ప్రభాకర్‌రావు అండ్ టీమ్..

విచారణకు ఆ ఐపీఎస్‌లు..

ఫోన్ ట్యాపింగ్ కోసం టెలికాం సర్వీసులకి పంపిన నెంబర్లపై కూడా దర్యాప్తు కొనసాగుతోంది. ప్రభాకర్ రావు టీమ్ అప్పట్లో మావోయిస్టుల సానుభూతిపరులు అంటూ కొన్ని ఫోన్ నెంబర్లను ట్యాపింగ్‌కు సిఫారసు చేసినట్టు సమాచారం. వాటికి అనుమతులు ఎలా ఇచ్చారు? డీజీపీ జితేందర్, అనిల్ ఇచ్చిన వివరాల మేరకు ఆ స్టేట్‌మెంట్‌లను ధృవీకరించేందుకు గురువారం నాటి ప్రభాకర్‌రావు విచారణ కీలకంగా మారింది. త్వరలో మాజీ డీజీపీ మహేందర్ రెడ్డి, మాజీ సీఎస్ సోమేష్ కుమార్ స్టేట్‌మెంట్ రికార్డ్ చేయనున్నట్టు తెలుస్తోంది.

మావోయిస్టుల పేర్లు చెప్పి..

మావోయిస్టులకు మద్దతు, నిధులు సమకూరుస్తున్నారనే ఏకైక కారణంతో ఇష్టారీతిన ఫోన్ ట్యాపింగ్ చేసినట్టు విచారణలో వెలుగు చూస్తోంది. ఎన్నికలకు ముందు నెల రోజులు.. ఏకంగా 600 మంది ఫోన్ కాల్స్ చాటుగా విన్నారని తేలింది. అందులో ఆనాటి పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి నుంచి ఎన్నికల సర్వేలు

# ఆ ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వద్దని కేంద్రాన్ని కోరాం..

హైదరాబాద్,దేశ రాజధాని ఢిల్లీ పర్యటన లో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి , మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్ర జల శక్తి మంత్రి సీఆర్ పాటిల్ తో సమావేశమయ్యారు పోలవరం బనకచర్ల ప్రాజెక్టు కు అనుమతులు ఇవ్వొద్దని ఫిర్యాదు చేశారు. భేటీ ముగిసిన అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడారు.. బనకచర్ల లింక్ ప్రాజెక్టు చట్ట విరుద్ధమని చెప్పామని.. తమ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుంటామని కేంద్ర జలశక్తి మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు.

ఇప్పటివరకు డీపీఆర్ ఇవ్వలేదు..

బనకచర్లపై త్వరలో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశం నిర్వహిస్తామని కేంద్రమంత్రి చెప్పారని, గోదావరిలో 1000 టీఎంసీలు, కృష్ణాలో 500 టీఎంసీలు తెలంగాణకు బ్లాంకెట్ %అశీ% ఏపీ రాసివ్వాలని కోరామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. దానికి కేంద్రం ప్రభుత్వం ఆమోదం తెలపాలన్నారు. అప్పుడే తాము బనకచర్లపై ఏపీ ప్రభుత్వంతో చర్చలు జరుపుతామని స్పష్టం చేశారు. బనకచర్ల ప్రాజెక్టుకు కేంద్ర పర్యావరణ శాఖ అనుమతులు తప్పనిసరి అని, ఇప్పటి వరకు ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్‌ను కేంద్ర ప్రభుత్వానికి ఇవ్వలేదని అన్నారు.

వీలైతే సుప్రీం కోర్టును ఆశ్రయిస్తాం..

బనకచర్ల ప్రాజెక్టు అంశంలో తమకు ఉన్న అభ్యంతరాలను కేంద్రమంత్రికి వివరించామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. బనకచర్ల ప్రాజెక్టు పట్ల తెలంగాణ ప్రజల్లో తెలంగాణ రైతుల పట్ల ఆందోళన ఉందని, గోదావరి కృష్ణ నుంచి 1500 టీఎంసీల వాటర్ తెలంగాణకు బ్లాంకెట్ %అశీ% ఇస్తే దాని ద్వారా కోటిన్నర ఎకరాలకు నీళ్లు అందించగలుగుతామని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టులకు త్వరితగతిన ఆమోదాలు లభిస్తున్నాయని, తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన అనేక ప్రాజెక్టులు వేగవంతంగా నిర్మాణం చేయాలనుకున్నా.. ప్రాజెక్టులు అనుమతులు నెమ్మదిగా అవుతున్నాయని మంత్రి అన్నారు. అయితే తమ అభ్యంతరాలపై కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ అన్ని విధాలుగా హామీ ఇచ్చారని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా మూసి పునర్జీవం కోసం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారన్నారు. తెలంగాణకు అన్యాయం జరగకుండా అన్ని విధాల చర్యలు చేపడతామని చెప్పారన్నారు. బనకచర్ల ప్రాజెక్టు అంశంలో వీలైతే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

# రెడ్‌బుక్ తప్ప పేదలను ఆదుకునే చర్యలేవీ

అమరావతి,ఎంత సేపు 'రెడ్ బుక్.. రెడ్ బుక్' తప్ప పేదలకు న్యాయం చేయాలనే ఆలోచన కూటమి ప్రభుత్వానికి కనిపించడం లేదని జగన్ పేర్కొన్నారు. వైసీపీ కేంద్ర కార్యాలయంలో జగన్ మీడియాతో మాట్లాడారు. రామగిరి మండలం ఏడుకుర్రాకులలో తొమ్మిదో తరగతి చదువుతున్న బాలికను 14 మంది టీడీపీ వాళ్లు సామూహిక అత్యాచారాన్ని చేశారు. కనీసం ఫిర్యాదు కూడా ఇవ్వనీయకుండా భయపెట్టింది నిజం కాదా?. తండ్రి లేని ఆ కుటుంబాన్నీ భయపడితే వాళ్లు ఊరు విడిచి వెళ్లింది నిజం కాదా?. ఆ బాలికకు న్యాయం చేసే దమ్ము చంద్రబాబుకు లేదా?. న్యాయం చేయాలనే సిన్సియారిటి ఆయనకు లేదు. అనంతపురం జిల్లాలో ఇంటర్ చదువుతున్న గిరిజన బాలిక కనిపించటం లేదని తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఆరు రోజుల తర్వాత ఆ పాప శవమై దొరికింది. కుప్పం నియోజకవర్గంలో అప్పు చెల్లించలేదని మహిళను చెట్టుకు కట్టేశారు. ఈ మనిషా ఆడవారి గౌరవం గురించి మాట్లాడేది. ఎంత సేపు రెడ్ బుక్.. రెడ్ బుక్ తప్ప పేదలకు న్యాయం చేయాలనే ఆలోచన ఏది?' అని వైఎస్ జగన్ మండిపడ్డారు. 'ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ అన్నాడు.. సూపర్ సెవెన్ అన్నాడు. ప్రతీ కుటుంబంలో మహిళలు తన సొంత కాళ్ల మీద నిలబడాలి. మహిళలు స్వయంగా వాళ్ళ కాళ్ల మీద వాళ్లు నిలబడాలి అని ఆరాట పడ్డాం. మహిళలకు ఎంతో చేసింది ఒక్క వైసీపీ ప్రభుత్వం మాత్రమే. చట్టం చేసి మరీ 50 శాతం పదవులు మహిళలకు ఇచ్చిన ఘనత జగన్‌దని అన్నారు. ఎవరికి మహిళల మీద గౌరవం ఉంది అని అడుగుతున్నా. మంచి చేసినా మాకా.. ఆ ముసుగులో ఇలాంటి పనులు చేసిన ఆయనకా. మహిళలకు అయినా.. పిల్లను ఇచ్చిన మామకు అయినా వెన్నుపోటు పొడవటంతో ఆయనకు ఆయనే సాటి. ఎన్నికల ముందు జగన్ సంక్షేమ కార్యక్రమాలు ఆగిపోవు.. ఇంకా మెరుగైన కార్యక్రమాలు చేపట్టి ముందుకు తీసుకెళ్తా అని చెప్పిన చంద్రబాబు.. చూ మంతర్ అంటూ సూపర్ సిక్స్ మొత్తం చేసేసా అని చెబుతున్నారు. ఎవరైనా సూపర్ సిక్స్ అని అడిగితే నీ నాలుక మందం అని బెదిరిస్తున్నారు. నిరుద్యోగ యువతకు ఏడాదికి 36 వేలు ఇస్తామని చెప్పారు.. ఎంత ఇచ్చారు. ఒక్కరికి ఇచ్చిన పాపాన పోలేదు. 18 ఏళ్లు నిండిన మహిళకు ఆడబిడ్డ నిధి ఇస్తామన్నారు.. 2.10 కోట్ల మంది మహిళలు ఓటర్లుగా ఉన్నారు. 60 ఏళ్లు నిండిన వాళ్లను తీసేస్తే 1.80 కోట్ల మంది ఉన్నారు. ఇప్పుడు మళ్ళీ పీ4 అని కొత్త డ్రామా ఆడుతున్నారు. 1.59 కోట్ల మందికి దీపం గ్యాస్ కనెక్షన్స్ ఇవ్వాలి అంటే 4109 కోట్లు ఖర్చు అవుతుంది. దీనికి టికీ ఏడాది బ్జడెట్ కేటాయింపు 860 కోట్లు. మరి చెప్పిన మాటలు మొత్తం మోసం కాదా అని అడుగుతున్నా' అని జగన్ ప్రశ్నించారు. 'మహిళలకు ఉచిత బస్సు అన్నిటికన్నా సులభం. రాష్ట్రంలో మహిళలు మొత్తం ఎదురుచూస్తున్నారు. సంవత్సరం అయ్యింది, పండుగల పేర్లు మారుతున్నాయి. అధ్యయనం కోసం ఎక్కడికో వెళ్ళాల్సిన పనేముంది.. ఆర్టీసీకి డబ్బులు ఇస్తే చాలు. ఎవరికి కావలసిన వాళ్ళు అక్కడకు వెళ్ళి చూసి వస్తారు. 50 ఏళ్లకు పెన్షన్ అన్నారు.. రాష్ట్రంలో 20 లక్షల మంది అర్హులు ఉన్నారు. మొదటి సంవత్సరం ఎవరికీ ఇవ్వలేదు.. రెండవ ఏడాది వచ్చింది. ఇచ్చే పెన్షన్లు కూడా తగ్గించేశారు. ఎన్నికల తర్వాత ఐదు లక్షల పెన్షన్లు తీసేసారు. ఒక్కటి కొత్తది ఇవ్వకపోగా ఐదు లక్షల పెన్షన్లు తీసేసారు. ప్రధాని పీఎం కిసాన్తో సంబంధం లేకుండా రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద 20 వేలు ఇస్తా అన్నాడు. గత ఏడాది ఒక్కరికి కూడా రూపాయి ఇవ్వలేదు.. ఇది మోసం కాదా? అని ప్రశ్నించారు. . రాష్ట్రంలో 10,716 కోట్లు ఇవ్వాల్సింది ఎగగొట్టారు. తల్లికి వందనం పేరిట తల్లులకు వంచన చేస్తున్నారు. ప్రతీ విద్యార్థికి ఎలాంటి షరతులు లేకుండా ఒక్కొక్కరికీ 15 వేలు ఇస్తా అన్నాడు. ఆంక్షలు లేవు..

# ముంబైని ముంచెత్తిన భారీ వర్షం

ముంబయి,మహారాష్ట్ర రాజధాని ముంబయిలో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. రోడ్లన్నీ జలమయంగా మారాయి. రోడ్లపై నీరు చేరడంతో వాహనాలు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. భారీ వర్షం కురుస్తుండడంతో ప్రజలు ఎవరు బయటకు రావడంలేదు. వాతావరణ శాఖ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. బుధవారం సాయంత్రం నుండి ఇప్పటివరకు 200 మి.మీ. వర్షపాతం నమోదైందని వెల్లడించింది. ముంబయి, పరిసర ప్రాంతాలకు ఐఎండి ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. భారీ వర్షాల కురస్తున్న నేపథ్యంలో ప్రజలు అత్యవసరమయితే తప్ప బయటకు రావద్దని వాతావరణ శాఖ అధికారులు సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో నీటి మట్టం పెరుగుతుండడంతో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ప్రజలు అధికారిక సూచనలను పాటించడంతో పాటు అపోహలకు లోనుకావొద్దని హెచ్చరికలు జారీ చేశారు.

# ఏడాది కూటమి పాలనపై పోరాడుతున్నాం



అమరావతి, ఏపీలో ఏడాదిగా కూటమి పాలనలో.. టీడీపీ, ఎల్లో మీడియాతో యుద్ధం చేస్తున్నామని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో దిగజారిన శాంతిభద్రతలు,పాలన వైఫల్యాలు, మోసాల మధ్య చంద్రబాబు పాలన కొనసాగుతోందన్నారు. గురువారం తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో వైఎస్ జగన్ మాట్లాడారు. చంద్రబాబు అరాచక పాలనకు వ్యతిరేకంగా జూన్4న ప్రజలు, వైఎస్సార్‌పీ శ్రేణులు భారీ ఎత్తున పాల్గొని వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేశారు. టీడీపీ నేతలు, పోలీసుల వేధింపులతో ఆత్మహత్య చేసుకున్న నాగమల్లేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించేందుకు రెంటపాళ్ల వెళ్లా. కర్ఫ్యూలాంటి పరిస్థితుల మధ్య నా రెంటపాళ్ల పర్యటన జరిగింది. అయినా విజయవంతమైంది. మా పార్టీ శ్రేణుల్ని పరామర్శిస్తే తప్పా? మొన్నటి పొదిలి పర్యటనలో 40వేల మందిపై రాళ్లేసే ప్రయత్నం చేశారు. రైతులు సంయమనం పాటించారు. అయినా కేసులు పెట్టారు. రైతుల సమస్యల గురించి ఎవరూ మాట్లాడకూడదు. సంఘీభావం తెలపకూడదా? అని ప్రశ్నించారు. చంద్రబాబు ఎందుకు భయపడు తున్నారు. ఓ టీవీ ఛానెల్‌లో చంద్రబాబు అహంకార మాటలు వినండి. ప్రతిపక్షంను భూస్థాపితం చేస్తారట. ప్రశ్నిస్తున్న వ్యక్తిని భూస్థాపితం చేస్తారా?. ఏడాది కాలంలోనే ఎన్నడూ లేని విధంగా ప్రజల్లో చంద్రబాబు పాలనపై అసహనం పెరిగింది. ఆ అసహనాన్ని డైవర్ట్ చేస్తూ వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై, నేతలపై కేసులు పెడుతున్నారు. టాపిక్ డైవర్ట్ చేస్తున్నారని మండిపడ్డారు. డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు, నేతలపై తప్పుడు కేసులు పెడుతున్నారు. మద్యం కేసులో అక్రమ అరెస్టులు జరుగుతున్నాయి. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని అరెస్ట్ చేశారు. చెవిరెడ్డి అరెస్ట్ నిజంగా అశ్చర్యకరం. తప్పుడు స్టేట్‌మెంట్ ఇవ్వాలని గన్‌మెన్‌ను బలవంతం చేశారు. తప్పుడు స్టేట్‌మెంట్ ఇవ్వనందుకు గన్‌మెన్‌పై దాడి కూడా చేశారు. తనపై జరిగిన దాడిని గురించి ప్రస్తావిస్తూ రాష్ట్రపతి, గవర్నర్, డీజీపీకి గన్‌మెన్ లేఖ రాశారు. మరో గన్‌మెన్‌ను ప్రలోభాలకు గురిచేసి వారికి అనుకూలంగా స్టేట్‌మెంట్ ఇప్పించుకున్నారు. చెవిరెడ్డితో పాటు ఆయన కొడుకును కేసులో ఇరికించారు. సొంత నియోజవకర్గంలో గెలవలేని వ్యక్తి. చంద్రగిరిలో ఇబ్బంది ఉండకూడదనే చెవిరెడ్డిని అరెస్ట్ చేశారు. తప్పుడు కేసులో పిన్నెల్లిని అరెస్ట్ చేశారు. మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను అక్రమంగా అరెస్ట్ చేశారు. సుప్రీంకోర్టుకు వెళ్లి బెయిల్ తీసుకొచ్చాం. మళ్లీ తప్పుడు కేసులు పెట్టి అరెస్ట్ చేశారు. సురేష్ భార్యపైనా కేసులు పెట్టారు. వల్లభనేని వంశీపై 11 కేసులు పెట్టారు. జోగి రమేష్ కొడుకు, కాకాణిపై తప్పుడు కేసులు. కృష్ణమోహన్‌రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్‌రెడ్డిపైనా అక్రమ కేసులు పెట్టారు. కొడాలి నాని, సజ్జల రామకృష్ణారెడ్డి, పేర్నినాని, వైవి సుబ్బారెడ్డి,ఆయన కుమారుడిపై తప్పుడు కేసులు. దేవినేని అవినాష్, మాజీ ఎమ్మెల్యే ఆర్కే,అంబటి రాంబాబు, విడదల రజినిపై తప్పుడు కేసులు దళిత ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌పైనా అక్రమ కేసులు. బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిపై, ఉషశ్రీచరణ్, తోపుదుర్తి ప్రకాష్, గోరంట్ల మాధవ్‌పై కేసులు. ఇలా వైఎస్సార్‌సీపీ నాయకులపై తప్పుడు కేసులు పెట్టి అరెస్ట్ చేయాలని చూస్తున్నారు. సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావు ఏం పాపం చేశారు? ఏం చేశారని కొమ్మినేనిని అరెస్ట్ చేశారు?టీవీ డిబెట్‌లో అనలిస్ట్ మాటలకు కొమ్మినేనికి ఏం సంబంధం? గతంలో కేఎస్ఆర్ ఉద్యోగాన్ని చంద్రబాబు ఊడగొట్టిం చారు. కేఎస్ఆర్ అరెస్ట్ అక్రమమేనన్న సుప్రీంకోర్టు.. తనకున్న విచక్షణాధికారాల్ని ఉపయోగించి ఆయన్ను వెంటనే విడుదల చేయాలని ఆదేశాలించింది. సుప్రీం కోర్టు తీర్పు చంద్రబాబుకు చెంపపెట్టులాంటిదని జగన్ అన్నారు. ప్రజల కోసం ఆలోచన చేసిన ప్రభుత్వం మాది. 32లక్షల ఇళ్ల పట్టాలు ఇచ్చాం. 22 లక్షల ఇళ్లను మంజూరు చేసి 10లక్షల ఇళ్లు పూర్తి చేశాం. చట్టం చేసి మరి నామినేటెడ్ పదవుల్లో మహిళలకు అవకాశం కల్పించ్చాం. మహిళలపై ఎవరికి గౌరవం ఉంది?. మహిళలంటే చంద్రబాబుకు గౌరవం లేదు. వెన్నుపోటు పొడవటంలో చంద్రబాబుకు ఆయనే సాటి అంటూ విమర్శించారు. 5వేల కోట్లు కరెంట్ బిల్లుల బాదుడు,గవర్నమెంట్ స్కూళ్లు కాలేజీ కాలేజీల్ని నిర్వీర్యం చేశాడు. ప్రైవేట్ స్కూల్స్, కాలేజీల్లో ఫీజుల పేరిట బాదుడే బాదుడే. రేషన్ వెహికల్స్ వాహనాల్ని తీసేశాడు. రేషన్ ద్వారా ఇచ్చే పప్పు దాన్యాల్ని ఎగనామం పెట్టాడు. ఫలితంగా పప్పు దాన్యాల రేట్లు పెంచి బాదుడే బాదుడు. కొత్త ఉద్యోగాలు ఇవ్వాల్సింది పోయి.. సుమారు 3లక్షలపై చీలూకు ఉద్యోగాల్ని తొలగించారు. పంటలకు సరైన మద్దతు లేదు. ప్రభుత్వ ఉద్యోగస్తులకు ఏమైనా ఒరిగిందా అంటే? అదీ లేదు. వచ్చీ రాగానే పీఆర్సీ అన్నారు. పీఆర్సీని ఆపేశారు. ఈ జులై 1వ తారీఖుతో కలిసి నాలుగు డీఏ ఇవ్వాలి. ఉద్యోగస్తులకు ఇవ్వాల్సిన 20 వేలకోట్ల వరకు ఆపేశారు. చంద్రబాబు తాను అబద్ధమాడుతూ.. తానెప్పుడూ ప్రభుత్వ ఆస్తుల్ని తాకట్టు పెట్టడం లేదన్నాడు. మద్యం ఆదాయం తాకట్టుపెట్టడం లేదు. కానీ 4-4-2025 నాడు విడుదల చేసిన జీవో 69 కింద ఏపీఎండీసీ కింద 436 మినరల్ ప్రాజెక్ట్‌ను తాకట్టు పెట్టారు. వాటి విలువ 191,000 కోట్లు అన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోను అందరూ రెడీగా పెట్టుకోవాలి. చంద్రబాబు తన పాలన గురించి తెలుసుకునేందుకు మీ ఇంటికి ఎమ్మెల్యేలు, ఇతర నేతల్ని పంపిస్తున్నారు. నేతలు వచ్చినప్పుడు మ్యానిఫెస్టో, బాబష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీ పేరుతో బాండును అందించారు. ఆ బాండు, ఎన్నికల మ్యానిఫెస్టో చూపిస్తూ ఎంత వరకు ఎన్నికల హామీలు నెరవేర్చారో అడగండి. అప్పుడైనా చంద్రబాబుకు ఎన్నికల హామీలు నెరవేర్చుతారో చూడాలి. ఒకవేళ మీ వద్ద 'బాబు మ్యానిఫెస్టోని గుర్తు తెచ్చుకుంటూ' అనే పేరుతో చంద్రబాబు మ్యానిఫెస్టోను డౌన్‌లోడ్ చేసుకునేలా క్యూఆర్ కోడ్‌ను వైఎస్సార్‌సీపీ అందుబాటులోకి తెస్తుంది' అని అన్నారు. ప్రభుత్వంపై ఫైట్ చేయండి. రాష్ట్ర ప్రజల తరుఫున వైఎస్సార్‌సీపీ నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటుందని జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు.

# పల్నాడులో పిన్నెల్లి పనికిరాడా?

పల్నాడు : పల్నాడు జిల్లా వైసీపీ అధ్యక్షుడి మార్పుపై పార్టీ శ్రేణులు మల్లగుల్లాలు పడుతున్నాయి. ఇప్పటికే దానిపై పార్టీ పెద్దలు కూడా ఆలోచన చేస్తున్నారంట. జిల్లా అధ్యక్షుడి మార్పుపై ఇప్పటికే అనేకసార్లు పల్నాడు పార్టీ శ్రేణులు డిమాండ్ చేసినా.. అధిష్టానం మాత్రం పాత నేత పిన్నెల్లి రామకృష్ణారెడ్డినే కొనసాగిస్తూ వస్తోంది. అయితే ఆయన సొంత నియోజకవర్గం మాచర్లకు కూడా అందుబాటులో లేకుండా పోవడంతో తాజాగా మార్పులుపై మరోసారి చర్చలు మొదలయ్యాయంట. మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి స్థానంలో ఇప్పటికే అనేక మంది పేర్లు కూడా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది..

పిన్నెల్లిని మారుస్తారా?

తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పల్నాడు జిల్లా వైసీపీ నేతలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జగన్ సీఎంగా ఉన్నప్పుడు ఇష్టానుసారం చెలరేగిపోయిన పల్నాడు జిల్లా వైసీపీ నేతలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గత సంవత్సర కాలంగా పల్నాడు జిల్లాలో పార్టీ పరిస్థితి గాడిలో పెట్టేందుకు అధిష్టానం అనేక ప్రయత్నాలు చేస్తున్నప్పటికి, కార్యకర్తలకు భరోసా ఇవ్వడంలో విఫలం అవుతుందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. మాటలు పార్టి అంతర్గతంగా వినిపిస్తున్నాయి. ప్రదానంగా పల్నాడు జిల్లాకు సంబంధించి గతంలో వైసీపీ అధ్యక్షుడిగా ఉన్న మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని మార్చేస్తున్నారని గట్టి ప్రచారమే జరిగింది..

పాల్వాయి గేటు పోలింగు బూత్‌లో ఈవీఎం ధ్వంసం చేసిన పిన్నెల్లి

ఎన్నికల సమయంలో పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గంలోని పాల్వాయ్ గేటు పోలింగు బూత్‌లో పిన్నెల్లి ఈవీఎం ధ్వంసం చేశారు %ఔ%. ఈవీఎంను బద్దలుకొట్టడంతో పాటు అడ్డుకోబోయిన టీడీపీ ఏజెంట్ నంబూరి శేషగిరిరావుపై దాడి చేసి, హత్యాయత్నానికి పాల్పడారు దీనిపై ప్రశ్నించిన చెరుకూరి నాగశిరోమణి అనే మహిళను దుర్భాషలాడి బెదిరించారు అలాగే పోలింగ్ మరుసటిరోజు పిన్నెల్లి, ఆయన తమ్ముడు వెంకట్రామిరెడ్డి అనుచరులతో కలిసి కారంపూడిలో అరాచకం సృష్టించారు. సీఐ టీపీ నారాయణస్వామిపై దాడిచేసి గాయపరిచారు.

పోలింగ్ ముగిసాక అరెస్ట్ భయంతో పరారైన పిన్నెల్లి

వీటన్నింటి మీదా పోలీసులు కేసులు నమోదు చేశారుఅప్పటికే హౌస్ అరెస్టులో ఉన్న పిన్నెల్లి పోలింగ్ ముగిసాక అరెస్ట్ భయంతో పరారయ్యారు .. అయితే ఎన్నికల ఫలితాలకు ముందు అరెస్ట్ కాకుండా హైకోర్టు నుంచి ముందస్తు బెయిల్ మినహాయింపు పొందారు. ఓట్ల లెక్కింపు తర్వాత జూన్ 6వ తేదీ వరకు అరెస్ట్ చేయొద్దని హైకోర్టు ధర్మాసనం పోలీసులను ఆదేశించింది. ఆ తర్వాత కూడా పొడిగిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది.

మళ్లీ గెలిచేది తామే అన్న ధీమాతోనే పిన్నెల్లి అరాచకాలు

పిన్నెల్లి మధ్యంతర బెయిల్‌పై బాధితులు సుప్రీంకోర్టుకు వెళ్లారు అప్పట్లో హైకోర్ట్ మధ్యంతర బెయిల్‌పై సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది దీంతో పిన్నెల్లి పిటిషన్లపై గతంలోనే వాదనలు విన్న ఏపీ హైకోర్టు తీర్పు వెలువరింది%ఔ% మినహాయింపులను హైకోర్టు కొట్టివేసింది. ముందస్తు బెయిల్ నిరాకరించిన నేపథ్యంలో పిన్నెల్లిని పోలీసులు అరెస్టు చేశారు ఎన్నికల సమయంలో పల్నాడులో మరీ ముఖ్యంగా మాచర్లలో చోటు చేసుకున్న హింసాత్మక ఘటనలు యావత్తు రాష్ట్రాన్ని ఆశ్చర్యపరిచాయి %ఔ% మళ్లీ గెలిచేది తామే అన్న ధీమాతోనే పిన్నెల్లి ఎవర్నీ లెక్కచేయకుండా చెలరేగిపోయారన్న విమర్శలు వెల్లువెత్తాయి

జూన్ 26న అరెస్ట్ అయి 2 నెలలు జైల్లో ఉన్న పిన్నెల్లి

జూన్ 26న అరెస్ట్ అయిన పిన్నెల్లి దాదాపు రెండు నెలలుగా నెల్లూరు సెంట్రల్ జైలులో ఉన్నారు %ఔ% అరెస్ట్ అయిన మొదటి వారంలో మాజీ సీఎం జగన్ నెల్లూరు జైలుకెళ్లి పిన్నెల్లిని పరామర్శించి వచ్చారు అప్పట్లో జైల్లో ఉన్న పిన్నెల్లిని మాజీ ముఖ్యమంత్రి గట్టిగానే సపోర్ట్ చేశారు . ఈవీఎంను పగలగొట్టడాన్ని



సమర్థించారు%ఔ% అక్కడ అన్యాయం జరిగింది కాబట్టే.. అలా చేయాల్సి వచ్చిందంట%ఔ%. ఎమ్మెల్యేగా నాలుగు సార్లు వరుసగా గెలిచారంటేనే పిన్నెల్లి ఎంత మంచివాడో అర్థం అవుతుందని కితాబు కూడా ఇచ్చారు. ఆ క్రమంలో ఆగస్టులో పలు కండీషన్లతో ఏపీ హైకోర్టు పిన్నెల్లికి బెయిల్ మంజూరు చేసింది.

మాచర్లలో కనిపించడమే మానేసిన పిన్నెల్లి

బెయిల్ వచ్చిన తర్వాత పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కేసుల భయంతో పల్నాడు జిల్లాకే కాదు మాచర్ల నియోజకవర్గంలో కనిపించడమే మానేశారు. అయినా మాచర్ల వైసీపీ ఇన్చార్జ్‌తో పాటు జిల్లా పార్టీ అధ్యక్ష పదవి కూడా జగన్ ఆయనకే కట్టబెట్టారు. అయితే సొంత నియోజకవర్గంలో కార్యకర్తలపై కేసులు నమోదవుతున్నా పిన్నెల్లి పట్టించుకోవడం లేదంట. పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాల్లో కూడా పాల్గొనడం లేదు. జిల్లా లోని నియోజకవర్గ ఇన్చార్జ్‌లతో కూడా ఆయన టచ్‌లో లేరంట.

గురజాల, మాచర్ల క్యాడర్‌కు దిక్కవుతున్న అంబటీ, అప్పిరెడ్డి

జిల్లాలోని చిలకలూరిపేటలో వైసీపీ ఇన్చార్జ్, మాజీ మంత్రి విడదల రజని, నరసరావుపేట ఇన్చార్జ్, మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఎవరికి వారు తమ కార్యకమాలు చేపడుతున్నారు. జిల్లా స్థాయిలోఎక్కడా కార్యక్రమాలు నిర్వహించడంలేదు. గురజాల వైసీపీ ఇన్చార్జ్, మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి కూడా నియోజకవర్గానికి పూర్తిగా దూరమయ్యారు. దాంతో గురజాల, మాచర్ల కార్యకర్తలకు సమస్య వస్తే గుంటూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడు అంబటి రాంబాబు , ఎమ్మెల్సీ అప్పిరెడ్డి వచ్చి పరామర్శించే పరిస్తితులు ఏర్పడ్డాయని కార్యకర్తలు వాపోతున్నారు.

పార్టీ ఉనికి కోసం కొత్త అధ్యక్షుడు కావాలంటున్న క్యాడర్

వైసీపీ ప్రభుత్వ హయాంలో పల్నాడు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఆ పార్టీ ఎమ్మెల్యేలే ఉన్నారు. అయితే ఇప్పుడు ఆ పార్టీకి ప్రాతినిధ్యమే లేదు. మరోవైపు పార్టీ శ్రేణులు కేసుల భయంతో వణికిపోతూ బయటకు రావడానికే భయపడుతున్నాయంట. మాజీ మంత్రి విడదల రజనీపై కూడా వరుసగా కేసులు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో పల్నడులో పార్టీకి పూర్వ వైభవం తేవడం కాదు.. కనీసం ఉనికిని కాపాడుకోవాలంటే జిల్లా అధ్యక్షుడ్ని మార్చాలని పార్టీ కార్యకర్తలు కోరుకుంటున్నారు.

అధ్యక్షుడ్ని మారుస్తారా? పిన్నెల్లినే కొనసాగిస్తారా?

కొత్త నాయకత్వం ఎంపికకు సంబంధించి వైసీపీ అధిష్టానం సామాజిక వర్గాలు, సీనియార్టీ లెక్కలు కేసుకుంటోందంట. పల్నాడు జిల్లాలో రాజకీయం చేయాలంటే అర్దబలం, అంగబలం వున్న నాయకులు అవసరమని కార్యకర్తలు అంటున్నారు. ఆ క్రమంలో జిల్లా పార్టీ అధ్యక్ష రేసులో నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీమంత్రి విడదల రజని పేర్లు వినబడుతున్నాయి. మరి ఈ సారి అయినా అధిష్టానం మార్పుకి శ్రీకారం చుడుతుందా? లేక పిన్నెల్లి పై వున్న నమ్మకంతో ఆయననే కొనసాగిస్తుందో? చూడాలి

# అమెరికా వెళ్లే విద్యార్థులకు వీసోదయం

వాషింగ్టన్, అమెరికాలో చదువుల కోసం ఎదురుచూస్తున్న విదేశీ విద్యార్థులకు అగ్రరాజ్యం గుడ్‌న్యూస్ చెప్పింది. ఇటీవల తాత్కాలికంగా నిలిపివేసిన విద్యార్థి వీసా ఇంటర్వ్యూల షెడ్యూలింగ్‌ను మళ్లీ ప్రారంభించింది. అయితే, వీసా కోసం దరఖాస్తు చేసుకునే విద్యార్థుల సోషల్ మీడియా ఖాతాలను తప్పనిసరిగా తనిఖీ చేస్తామని వెల్లడించింది. ఈమేరకు అమెరికా విదేశాంగ శాఖ తాజాగా మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ ఏడాది మే చివరి వారం నుంచి ప్రపంచవ్యాప్తంగా ఉన్న అమెరికా రాయబార కార్యాలయాల్లో కొత్తగా దరఖాస్తు చేసుకునే విద్యార్థుల వీసా ఇంటర్వ్యూల షెడ్యూలింగును తాత్కాలికంగా నిలిపివేసిన సంగతి తెలిసిందే. వీసా జారీకి అవసరమైన సామాజిక మాధ్యమ ఖాతాల పరిశీలనకు సన్నాహాలు చేస్తున్నామని, అందుకే వీసాల జారీని నిలిపివేశామని అప్పట్లో విదేశాంగ శాఖ వెల్లడించింది. ఈ క్రమంలోనే తాజాగా సోషల్ మీడియా వెట్టింగ్‌ను తప్పనిసరి చేస్తూ వీసా అపాయింట్‌మెంట్ల ప్రక్రియను పునరుద్ధరించింది. ఈ సోషల్ మీడియా వెట్టింగ్‌తో తమ దేశంలోకి వచ్చేందుకు ప్రయత్నించే ప్రతి వ్యక్తిని పూర్తిగా పరిశీలించేందుకు వీలు లభిస్తుంది. వీసా దరఖాస్తుదారులకు అనుమతి ఇవ్వొచ్చా.. లేదా అనే దాన్ని అంచనా వేయడం కోసం వారి ఆన్‌లైన్ యాక్టివిటీని అధికారులు తనిఖీ చేయనున్నారు. దీన్నే 'సోషల్ మీడియా వెట్టింగ్' అంటారు. సంబంధిత విద్యార్థుల సోషల్ మీడియా ప్రొ÷ఫైలను పరిశీలించిన తర్వాతే వీసా మంజూరు చేస్తారు. ఉదాహరణకు.. ఎవరైనా విద్యార్థి తమ సామాజిక మాధ్యమ ఖాతాలో పాలస్తీనా జెండాను పోస్ట్ చేసినట్లయితే ఆ వ్యక్తిని క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. వారి వల్ల దేశ భద్రతకు ఏ ప్రమాదం లేదని నిర్ధరించుకున్న తర్వాతే వారిని అమెరికా విద్యాసంస్థల్లో చదువుకునేందుకు అనుమతినిస్తారు. అప్పుడే వారికి విద్యార్థి వీసా లభిస్తుంది. వీసా కోసం దరఖాస్తు చేసుకునే విద్యార్థుల సామాజిక మాధ్యమ ఖాతాలను యూఎస్ కాన్సులర్ అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేస్తారు. ఇందుకోసం దరఖాస్తుదారులు తమతమ సోషల్ మీడియా ప్రొఫైళ్ల ప్రైవేటు సెట్టింగ్స్‌ను మార్చుకుని 'పబ్లిక్' ఆప్షన్ పెట్టుకోవాలి' అని విదేశాంగ శాఖ సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు.

# ఇరాన్ అణు స్థావరాలు దెబ్బతిన్నాయా?

టెహ్రాన్,ఇరాన్ అణ్వాయుధ ప్రణాళికలను నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ భీకర దాడులు కొనసాగిస్తోంది. ఇప్పటికే దాడుల్లో ఇరాను ముఖ్యులు హతమయ్యారు. ఖొమేనిని కూడా అంతమొందిస్తామని అంటున్నారు. ఇకపోతే పలు యురేనియం శుద్ధి కేంద్రాలను ఐడీఎఫ్ ధ్వంసం చేసింది. అయితే.. అణు బాంబుల తయారీ కోసం టెహ్రాన్‌కు ఉన్న అన్ని వనరులను సమూలంగా నాశనం చేసేందుకు ఇజ్రాయెల్ సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే తాజాగా అరాక్ హెవీ వాటర్ రియాక్టర్ ప్రాంతాన్ని ఖాళీ చేయాలంటూ ఐడీఎఫ్ పోస్ట్ పెట్టడం గమనార్హం. ఆ తర్వాత కాసేపటికే అక్కడ ఇజ్రాయెల్ దాడులు చేసింది. ఈ ప్లాంట్ ఉపగ్రహ చిత్రాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ అక్కడి ప్రజలకు ఐడీఎఫ్ వార్నింగ్ ఇచ్చింది. ఆ రియాక్టర్ సమీపంలోని ప్రజలు తక్షణమే ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయాలని హెచ్చరించింది. ఈ పోస్ట్ చేసిన కొన్ని గంటలకే అరాక్ హెవీ వాటర్ రియాక్టర్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడులు చేసింది. అయితే, ప్రస్తుతానికి అక్కడ రేడియేషన్ ప్రమాదం ఏదీ లేదని తెలుస్తోంది. అరాక్ హెవీ వాటర్ రియాక్టర్.. టెహ్రాన్‌కు నైరుతి దిశగా 250 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ హెవీ వాటర్‌ను న్యూక్లియర్ రియాక్టర్లు చల్లబర్చేందుకు ఉపయోగిస్తారు. అయితే ఈ పక్రియలో ప్లూటోనియం ఉప ఉత్పత్తిగా లభిస్తుంది. దీన్ని అణ్వాయుధాల తయారీలోనూ వినియోగిస్తారు. అంటే.. శుద్ధి చేసిన యురేనియం లేకుండానే అణుబాంబును అభివృద్ధి చేసేందుకు ఇరాన్‌కు ఉన్న ప్రత్యామ్నాయ మార్గం ఇది. 2015లో ప్రపంచదేశాలతో కలిసి ఇరాన్ అణుఒప్పందంపై సంతకం చేసింది. ఆ ఒప్పందానికి అనుగుణం గానే 2019లో హెవీ వాటర్ రియాక్టర్ సెకండరీ సర్క్యూట్‌ను టెహ్రాన్ ప్రారంభించింది. అప్పట్లో ఈ అరాక్ రియాక్టర్‌ను రీడిజైన్ చేసేందుకు ఇరాన్‌కు బ్రిటన్ సాయం చేసింది. ప్లూటోనియం ఉత్పత్తిని పరిమితం చేసేలా దీన్ని పునర్‌నిర్మించేందుకు సన్నాహాలు జరిగాయి. అయితే, ఇరాన్ మాత్రం దీనికి విరుద్ధంగా ప్లూటోనియం ఉత్పత్తిని పెంచుతున్నట్లు తెలిసింది. సాధారణంగా ఈ కార్యక్రమాలపై ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ (ఎంఇం) ఇన్‌స్పెక్టర్ల నిఘా ఉంటుంది. కానీ, ఇరాన్ వీరిపై ఆంక్షలు విధించడంతో.. హెవీ వాటర్ రియాక్టర్ కేంద్రం సామర్థ్యాలపై అంచనాల్లేకుండా పోయాయని ఐఏఈఏ వెల్లడించింది.

# భారీ ఎదురుదెబ్బ...

టెహ్రాన్/టెలీ అవీవ్: ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య భీకర యుద్ధం నడుస్తోంది. రెండు వైపుల నుంచి బాంబు దాడులు పీక్ స్టేజ్ చేరుకున్నాయి. ఇజ్రాయెల్‌పూ ఇరాన్ దళాలు విరుచుకుపడుతున్నాయి. ఇరాన్ ప్రయోగిస్తున్న బాలిస్టిక్ క్షిపణుల కారణంగా ఇజ్రాయెల్ రక్షణ వ్యవస్థ ధ్వంసమైంది. ఇజ్రాయెల్‌లోని ఆసుపత్రులు, స్కూల్స్, నివాస ప్రాంతాల్లోకి ఇరాన్ క్షిపణులు దూసుకెళ్లాయి. దీంతో, భారీగా ప్రాణ నష్టం జరిగినట్టు తెలుస్తోంది.తాజాగా ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులు ఇజ్రాయెల్‌లోని పలు నగరాల్లో బీభత్సం సృష్టించాయి. టెలీ అవీవ్, రామత్‌గాన్, హెూలోన్, బెర్షీబా నగరాలపై ఇరాన్ విరుచుకుపడింది. దీంతో, భయానక వాతావరణం నెలకొంది. బీర్షెబాలోని సోరోకా ఆసుప్రతిపై ఇరాన్ దాడి చేయడంతో భవనం పూర్తిగా దెబ్బతింది. అనంతరం, ఆసుపత్రిలో ఉన్న పేషంట్స్, వైద్యులు ప్రాణ భయంతో పరుగులు తీశారు. ఈ దాడిలో పలువురు గాయపడ్డారు. అత్యవసర బృందాలు స్పందించడంతో వారంతా ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలు వైరల్‌గా మారాయి.మరోవైపు.. ఇజ్రాయెల్‌లోని హెూలోన్ ప్రాంతంలో నివాసాలపై ఇరాన్ దాడులకు తెగబడింది. ఈ క్రమంలో పలువురు పౌరులు తీవ్రంగా గాయపడ్డారని టైమ్స్ ఆఫ్ ఇజ్రాయెల్ నివేదించింది. దక్షిణ ఇజ్రాయెల్‌లోని ప్రధాన, అతిపెద్ద ఆసుపత్రిపై ఇరాన్ దాడులు చేయడంతో భారీ నష్టం జరిగిందని చెప్పుకొచ్చింది. ఇజ్రాయోల్ రాజధాని టెలి అవీవ్‌లోని బహుళ అంతస్తు భవనాలపై క్షిపణి దాడులు జరగడంతో అవి పూర్తిగా దెబ్బతిన్నాయి. అంతకుముందు.. ఇరాన్ సైనిక సామర్థ్యం అణ్వస్త్ర స్థాయికి చేరకుండా అడ్డుకోవడమే లక్ష్యంగా దాడులతో దండయాత్ర చేస్తున్న ఇజ్రాయెల్ బుధవారం తన బాంబుల కుంభవృష్టిని కురిపించింది. ఇరాన్‌లోని 40 కీలక ప్రాంతాలపై క్షిపణులతో విరుచుకుపడింది. యురేనియం శుద్ధి ప్రక్రియలో కీలకమైన సెంట్రీఫ్యూజ్‌లను తయారుచేసే కర్మాగారంపై భీకరస్థాయిలో మిస్సైళ్లను ప్రయోగించింది. ఇరాన్ సాయుధశక్తిని నిర్వీర్యం చేసేందుకు క్షిపణుల ఉత్పత్తి ఆయుధ ప్లాంట్‌లపైనా ఇజ్రాయెల్ వందల కొద్దీ డ్రోన్లను ఎక్కుపెట్టింది.ఇరాన్ అంతర్గత భద్రత శాఖ ప్రధాన కార్యాలయంపైనా యుద్ధవిమానాలు దాడులు చేశాయి. ప్రతిగా ఇరాన్ సైతం ఇజ్రాయెల్ భూభాగాలపై క్షిపణులను పేలుస్తూ విధ్వంసం సృష్టిస్తోంది. ఇరాన్ జరిపిన ప్రతిదాడుల్లో ఇప్పటిదాకా 24 మంది చనిపోయారు.

# బనకచర్ల... రేవంత్ డీల్ చేసిన తీరిది !



హైదరాబాద్,ఒక్కోసారి ఒక్కో ఇష్యూ తిరిగి తిరిగి అనూహ్యంగా టార్గెట్ చేయాలనుకున్న వారికే ప్లస్ అవుతుంది. బీఆర్ఎస్ బనకచర్ల ఇష్యూని రైజ్ చేసింది ఈ ఇష్యూ ద్వారా బహుళ రాజకీయ ప్రయోజనాలను ఆశిస్తూనే రేవంత్ రెడ్డిని కార్నర్ చేసింది. రేవంత్ రెడ్డి ఒకనాడు టీడీపీలో కీలక నేతగా ఉన్నారు. చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడు కాబట్టి బాబు వర్సెస్ రేవంత్ రెడ్డి రచ్చ పెట్టాలనుకుంది. అది అలా కలసి వచ్చితమకే మైలేజ్ అని లెక్క వేసుకుంది.అయితే రేవంత్ రెడ్డి చాలా విషయంలో స్పష్టంగా ఉన్నారు. గత ఏడాది ఏపీలో టీడీపీ అధికారంలోకి వచ్చింది. రెండు రాష్ట్రాల మధ్య అనేక సమస్యల విషయంలో చర్చించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలంగాణ సీఎంతో కలసి కూర్చున్నారు. ఒకే ఒక్క భేటీ ఇద్దరి మధ్యన జరిగినా ఎవరి స్టాండ్ వారు తీసుకున్నారు. దాంతో ఆ భేటీ తర్వాత మరేమీ జరగలేదు.ఇక్కడ రేవంత్ రెడ్డి వైఖరి చూస్తే బాబు అంటే గౌరవం ఉంది. అయితే రాష్ట్రం రాజకీయం వేరు అన్నట్టుగానే ఆయన విడమరచి చూడగలుగుతున్నారు. అందుకే బాబు విషయం ప్రస్తావనకు వచ్చినప్పుడల్లా ఆయన ఇదే చెబుతున్నారు. అయితే ఇప్పటికీ రేవంత్ రెడ్డిని బాబు శిష్యుడిగానే చూస్తూ వస్తున్న బీఆర్ఎస్ ఆయనకు ఇరాకాటంలో పెడుతోందని అంటున్నారు.ఇక పోలవరం బనకచర్ల విషయం తీసుకుంటే ఇది రాజకీయ వివాదంగా తేవాల్సినది కాదనే అంటున్నారు. సముద్రంలో వృధాగా పోతున్న నీటిని ఏపీ ప్రభుత్వం వాడుకోవాలని అనుకుంటోంది. కానీ మొత్తం గోదావరి జలాలకే ఇబ్బందులు అన్నట్లుగా చర్చ సాగుతోంది.అయితే ఈ విషయంలో రేవంత్ రెడ్డి మీద ఒత్తిడి తెచ్చిన బీఆర్ఎస్ కి తనదైన తీరులోనే రేవంత్ రెడ్డి జవాబు ఇచ్చారు అని అంటున్నారు.ఆయన ఏపీతో న్యాయ పోరాటానికి అయినా రెడీ అనేంతదాకా వెళ్తున్నారు. తెలంగాణా రాష్ట్ర ప్రయోజనాల విషయంలో అసలు రాజీ లేదని కూడా అన్నారు. తెలంగాణా కోసం ఎందాకైనా అని చెబుతున్నారు. దీంతో పాటుగా ఆయన ఏపీ సీఎం చంద్రబాబు అయినా ఎవరైనా తాము పోరాడుతోంది తెలంగాణా కోసం అన్న ఆలోచ నతోనే ఉంటున్నారు.ఇక ఆయన అఖిల పక్ష సమావేశం నిర్వహించడమే కాదు హుటాహుటీన ఢిల్లీకి వెళ్లారు. కేంద్ర పెద్దలను కలిశారు. ఈ విషయం మీద చర్చించారు. కేంద్రం నుంచి సానుకూలత రాకపోతే మాత్రం తాము బీఆర్ఎస్ ఇపుడు ఏమాలోచిస్తుందో చూడాలని అంటున్నారు. ఏది ఏమైనా స్ట్రాంగ్ వాదనలతో రేవంత్ రెడ్డి అయితే తన స్టాండ్ ని జనం ముందు ఉంచారని అంటున్నారు.

# ఇరాన్ అధినేత ఖమేనీ హత్య సాధ్యమేనా?



టెహ్రాన్,ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీని హత్య చేయాలన్న ఇజ్రాయెల్ ప్రణాళికను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అడ్డుకున్నట్లుగా ఇటీవల పలు నివేదికలు పేర్కొన్నాయి. ఈ క్రమంలో ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ముఖ్యంగా ఇజ్రాయెల్ దాడిలో ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ కమాండర్ చనిపోయిన విషయం తెలిసిందే. ఇజ్రాయెల్ సైతం ఈ వార్తలను తోసిపుచ్చలేదు. సుప్రీం కమాండర్‌కు అనుకోని విధంగా ఏదైనా జరిగితే కొత్తగా బాధ్యతలు ఎవరు స్వీకరిస్తారనే చర్చ జరుగుతున్నది. ఇరాన్ రాజకీయాలు సంక్లిష్టంగా ఉన్నప్పటికీ నిపుణులు మాత్రం ఖమేనీ కుమారుడు అతని తర్వాత సుప్రీం లీడర్‌గా వచ్చేందుకు అవకాశం లేదని స్పష్టం చేస్తున్నారు. ఇటీవల 30 మంది ఇరానియన్ నిపుణులతో నిర్వహించిన బీబీసీ పర్షియన్ పోల్‌లో.. అయతుల్లా అలీ ఖమేనీ రెండో తనయుడు మోజ్‌తబా తన తండ్రి బాధ్యతలను చేపడుతాడని విశ్వసిస్తున్నట్లుగా తేలింది. కానీ, ఇరాన్ సొంత వ్యవస్థ అడ్డంకిగా మారే అవకాశం ఉంది. వంశపారంపర్య వారసత్వం ద్వారా అధికారాన్ని బదిలీ చేయాలన్న ఆలోచన 'ఇస్లాం వ్యతిరేకంగా' పేర్కొన్నారు. షాను తొలగించిన అయతుల్లా రుహోల్లా ఖమేనీ.. కుటుంబ పాలనకు వ్యతిరేకంగా తీవ్రస్థాయిలో స్పందించారు. ఇది రాచరికం కంటే మెరుగైంది ఏమీ కాదన్నారు. ఈ విషయంలో ఆయన ఆలోచనలు ప్రసంగాలు, ఇతర రచనలను సేకరించిన 21-సంపుటాల సముదాయం సహిఫెయే ఇమామ్ ఖమేనీలో నమోదయ్యాయి. 1989లో ఖమేనీ తర్వాత సుప్రీం నాయకుడిగా మారిన ఖమేనీ.. వంశపారంపర్య పాలన ఇస్లామిక్ వ్యవస్థకు తగదని అన్నారు. ఇరాన్‌లో అయతుల్లా రుహోల్లా ఖమేని చిత్రం ప్రతిచోటా కనిపిస్తుంది. ఇరాన్ కరెన్సీ నోట్లు.. తరగతి గదులు.. ప్రభుత్వ భవనాల్లో ఆయన చిత్రం కనిపిస్తుంది. ఆయన 1979 ఇస్లామిక్ విప్లవానికి నాయకత్వం వహించారు. పాశ్చాత్య దేశాల మద్దతు ఉన్న షాను పదవి నుంచి తొలగించారు. అమెరికా సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ 1983 నివేదికలో.. ఖమేనీ ప్రభావం లేకుండా ఈ విప్లవం సాధ్యమయ్యేది కాదని పేర్కొంది. మతం-రాజకీయాలు విడదీయరానివని ఆయన భావించేవారు. ఇస్లాం అంటే రాజకీయాలని ఆయన ఓ సారి వ్యాఖ్యానించారు. ఆయనపై షియా విశ్వాసాల లోతైన ప్రభావం కనిపిస్తుంది. ఆయన తాత సయ్యద్ అహ్మద్ ముసావికి భారత్‌తో సంబంధాలున్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని బారాబంకీ పట్టణం ఆయన స్వస్థలం. 1979 ఇస్లామిక్ విప్లవానికి నాయకత్వం వహించిన ఖమేనీ తన తాత అహ్మద్ ఆధ్యాత్మిక మార్గం నుంచే ప్రేరణ పొందారు. అహ్మద్ భారతదేశం నుంచి ఇరాన్‌కు వెళ్లారు. ఖమేనీ ఆ తర్వాత ఇరాన్ దేశ మొదటి సుప్రీం నాయకుడు అయ్యాడు. ఇరాన్‌ను దైవపరిపాలనా రాజ్యంగా మార్చాడు. అహ్మద్ తన భారతీయ మూలాలను ప్రతిబింబించడానికి 'హిందీ' అనే పేరును తన పేరులో కలిపి పెట్టుకున్నాడు. అహ్మద్ 1830లో బారాబంకీని వదిలి వెళ్లాడు. ఆయన తండ్రి దిన్ అలీ షా 1700లో మధ్య ఇరాన్ నుంచి భారతదేశానికి ప్రయాణించాడు. 1800 ప్రాంతంలో జన్మించిన అహ్మద్.. మొఘల్ సామ్రాజ్యం పతనం తర్వాత భారతదేశంలో బ్రిటిష్ నియంత్రణ పెరుగుతున్న సమయంలో లక్నో నుంచి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న బారాబంకీ సమీపంలోని కింటూరు గ్రామంలో పెరిగాడు. ఇస్లాంకు పునరుజ్జీవనం అవసరమని.. ముస్లింలు సమాజంలో తమ స్థానాన్ని తిరిగి పొందాలని నమ్మిన ముస్లిం ప్రముఖుల్లో ఒకడు. ఆయన షియా మత గురువు. 1800 ప్రారంభంలో భారతదేశం నుంచి ఇరాక్‌కు బయలుదేరాడు. ఆ సమయంలో పర్షియా పేరుతో పిలువబడ్డాడు. 1830లో నజాఫ్‌లోని అలీ సమాధిని సందర్శించాడు. 1834 నాటికి ఇరానియన్ పట్టణమైన ఖోమిన్‌కు వెళ్లి ఒక ఇల్లు కొనుక్కున్నాడు. అక్కడే కుటుంబాన్ని ప్రారంభించాడు. ఆయన ప్రయాణం తన మతంపై నమ్మకంతో దాన్ని వ్యాప్తి చేయాలనే కోరిక ఉండేది. ఖోమిన్‌లో ఆయన మూడుసార్లు వివాహం చేసుకున్నాడు. ఆయనకు ఐదుగురు సంతానం. వారిలో ఒకరు రుహోల్లా ఖోమినీ తండ్రి మోస్తఫా. ఆయన 1902లో జన్మించాడు. అహ్మద్ హిందీ 1869లో తుదిశ్వాస విడిచారు. ఖమేనీ పుట్టడానికి చాలా కాలం ముందే అహ్మద్ హిందీ మరణించినప్పటికీ.. కుటుంబ విలువలు, విశ్వాసం సుప్రీం లీడర్ ఖమేనీ ద్వారా ఇరాన్ భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో కీలకపాత్ర పోషించాయి.

# 55 ఏళ్ళ రాహుల్...పీఎం సీటు ఎంత దూరం ?

న్యూఢిల్లీ,దేశంలో కాంగ్రెస్ పార్టీ అతి పురాతనమైనది. దాదాపుగా చూస్తే నూటాభై ఏళ్ళ చరిత్ర కలిగినది. ఒక విదేశీ వనిత స్థాపించిన కాంగ్రెస్ దేశ స్వాతంత్ర ఉద్యమంలో కీలకమైన పాత్ర పోషించింది. స్వాతంత్ర్యం అనంతరం సుదీర్ఘ కాలం పాటు ఈ దేశాన్ని ఏలింది. ఈ రోజుకు దేశానికి స్వాతంత్రం వచ్చి 78 ఏళ్ళు అయితే అందులో అరవై ఏళ్ల పాటు ఏలింది కాంగ్రెస్ పార్టీనే.ఇక కాంగ్రెస్ పార్టీలో గాంధీ కుటుంబమే ప్రధాని పదవిని హెచ్చు కాలం నిర్వహించింది. నెహ్రూ ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ పాలన కలుపుకుంటే 38 ఏళ్ల పాటు వారే దేశాన్ని పాలించారు. రాజీవ్ గాంధీతో గాంధీల పాలనకు చెక్ పడింది. 1989 డిసెంబర్ లో జరిగిన లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడి రాజీవ్ మాజీ అయ్యారు. 1991 మేలో ఆయన మరణించారు. ఇక కాంగ్రెసేతర ప్రధానులలో పీవీ నరసింహారావు అయిదేళ్ళ పాటు పాలిస్తే మన్మోహన్ సింగ్ పదేళ్ళ పాటు పాలించారు.గాంధీ వంశంలో ఐదవ తరం వారసుడిగా 2004లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి రాహుల్ గాంధీ ప్రవేశించారు. ఆయన 34 ఏళ్ళ వయసులో తొలిసారి అమేథీ నుంచి పోటీ చేసి ఎంపీ అయ్యారు. ఆ సమయంలో రెండు సార్లు కాంగ్రెస్ నాయకత్వంలో యూపీఏ ప్రభుత్వం అధికారంలో ఉంది. కానీ రాహుల్ గాంధీ ప్రధాని అవలేదు. చేతిలో అధికారం ఉన్నా ఆయనే వద్దు అనుకున్నారు. అనుభవం రావాలని ఆగినట్లుగా ప్రచారం సాగింది. కనీసం 2009లో అయినా ఆయన ప్రధాని సీటు అఫర్ వచ్చినా తిరస్కరించారు అన్న ప్రచారం అప్పట్లో సాగింది.మొత్తానికి చూస్తే గడచిన మూడు ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడి ప్రతిపక్షంలోనే ఉంది. ఇలా చూస్తే కనుక 21 ఏళ్ళ రాహుల్ గాంధీ పొలిటికల్ కెరీర్ లో ఆయన గ్రాఫ్ అయితే నెమ్మదిగానే సాగుతోంది అని చెప్పాలి. గతానికి పోలిస్తే ఆయన రాజకీయంగా రాటు దేలారు. కానీ బీజేపీకి వ్యూహాలకు తగిన ప్రతి వ్యూహాలను రూపొందించడంలో ఇంకా తడబడుతున్నారనే చెప్పాల్సి ఉంది.ఇక 2024 ఎన్నికల తరువాత లీడర్ ఆఫ్ అపోజిషన్ గ లోక్ సభలో ఆయన కేబినెట్ హోదాతో స్థానం దక్కించుకున్నారు. ఒక విధంగా చెప్పాలంటే రాహుల్ గాంధీ పొలిటికల్ కెరీర్ లో ఇదే ఆయన అందుకున్న అతి పెద్ద అధికార పదవి. ఒక విధంగా ఆయన వెయిటింగ్ ప్రైమ్ మినిస్టర్ గా కూడా ఉన్నారు.అయితే ఆయనకు ప్రధానమంత్రి పీఠం ఎంత దూరం అన్నదే ఇక్కడ చర్చ. రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీ ఇండియా



కూటంలిలో పెద్దన్నగా ఉంది. ఇండియా కూటమికి ప్రస్తుత లోక్ సభలో 240 దాకా ఎంపీ సీట్లు ఉన్నాయి. అంటే అధికారం అందుకోవాలీ అంటే మ్యాజిక్ ఫిగర్ అయిన 272 సీట్లకు ఇంకా చాలా దూరంలోనే ఇండియా కూటమి ఉంది. ఇందులో కాంగ్రెస్ ఎంపీల సంఖ్య వంద దాకా ఉంది.మరి రేపటి ఎన్నికల్లో ఇండియా కూటమి మెజారిటీకి తగిన సీట్లు సాధించినా కాంగ్రెస్ తరఫున రాహుల్ గాంధీకి ప్రధాని పదవి ఇచ్చేందుకు ఇండియా కూటమి పక్షాలు అంగీకరిస్తాయా అన్నది మరో చర్చ. ఎందుకంటే అక్కడ తృణమూల్ కాంగ్రెస్, ఆప్, ఎస్పీ, ఎన్సీపీ వంటి పార్టీల నుంచి ఎంతో కొంత అభ్యంతరాలు వస్తాయి. అయితే రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అభ్యర్థిత్వాన్ని సమర్ధించడానికి తమిళనాడులో బలమైన డీఎంకే అధినేత స్టాలిన్, అలాగే బీహార్ నుంచి ఆర్జేడీ లాలూ సిద్ధంగా ఉంటారు అని చెప్పవచ్చు.ఈ రెండు పార్టీలకు కలిపి ఒక యాభై మంది ఎంపీలు ఉన్నా కాంగ్రెస్ తానుగా సొంతంగా 150 ఎంపీ సీట్లు 2029 ఎన్నికల్లో తెచ్చుకుంటే రాహుల్ గాంధీ చాలా ఈజీగా ప్రధానమంత్రి అవుతారు. అలా కాకుండా ఇదే వంద సీట్లకే కాంగ్రెస్ పరిమితం అయితే రాహుల్ గాంధీ ప్రధాని పీఠం ఆశలు జీవితకాలం లేటుగానే ఉంటాయని చెప్పక తప్పదు. ఏది ఏమైనా ఈ రోజుతో 55 ఏళ్ళు పూఒర్తి చేసుకుని 56వ పడిలోకి అడుగుపెడుతున్న రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు. ఆయనలో ఉన్నది ప్రజలకు సేవ చేయాలన్న తపన. లేనిది అధికార వ్యామోహం. మరి ఈ అయిదవతనం గాంధీ ప్రధాని అవుతారా ఎపుడు అవుతారు అన్నది వేచి చూడాల్సిందే.

# ఇజ్రాయెల్,ఇరాన్‌లకు ఆయుధాలు సరఫరా... ఎక్కడెక్కడి నుంచంటే..?



టెహ్రాన్:ఇజ్రాయెల్ - ఇరాన్ మధ్య భీకర యుద్ధం జరుగుతోన్న సంగతి తెలిసిందే. ఈ సమయంలో ఇజ్రాయెల్ కు అమెరికా సంపూర్ణ మద్దతు ఇస్తుండగా, ఈ సమయంలో జర్మనీ కూడా మరో చేయి వేసింది.. ఇజ్రాయెల్ కు ఆయుధ సహకారం అందించింది. ఈ సందర్భంగా... ఇజ్రాయెల్ ను రక్షించడానికి సైనిక పరికరాలను మోసుకెళ్లే కార్గో విమానాలు గురువారం వచ్చాయని రక్షణ మంత్రిత్వ శాఖ ధృవీకరించింది.అవును... ఇజ్రాయెల్ - ఇరాన్ మధ్య యుద్ధం తీవ్ర స్థాయికి చేరుకుంటున్న సంగతి తెలిసిందే. ఇరు దేశాలు క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడుతున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా, జర్మనీ నుంచి మిలటరీ కార్గో విమానాలు ఇజ్రాయెల్ కు చేరుకున్నాయి. ఇందులో ఆయుధాలతో పాటు ఇతర సామాగ్రి ఉందని అంతర్జాతీయ మీడియా వెల్లడించింది. ఈ ఆయుధాల సహకారం విషయాన్ని రక్షణ మంత్రిత్వ శాఖ ధృవీకరించింది.ఇదే సమయంలో... గత శుక్రవారం ఆపరేషన్ రైజింగ్ లయన్ ప్రారంభమైనప్పటి నుండి అలాంటి 14 విమానాలు ఇజ్రాయెల్ లో ల్యాండ్ అయ్యాయని, అక్టోబర్ 7న జరిగిన ఊచకోత తర్వాత ఇజ్రాయెల్ - హమాస్ యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి 800 కంటే ఎక్కువ విమానాలు ల్యాండ్ అయ్యాయని రక్షణ మంత్రిత్వ శాఖ పేర్కొంది! రాబోయే వారాల్లో ఇటువంటి కార్గో విమానాలు ఇజ్రాయెల్ కు మరిన్ని చేరుకుంటాయని తెలిపింది!దీనిపై ఇరాన్ స్పందించింది. ఇజ్రాయెల్ కు అమెరికా, జర్మనీ ల సహకారాన్ని తప్పుబట్టింది. ఇందులో భాగంగా... ఇది ఇరాన్ పై ఇజ్రాయెల్ దురాక్రమణలో అమెరికా బహిరంగ సహకారాన్ని సూచిస్తుందని పేర్కొంది.

ఇరాన్ కు చైనా ఆయుధాలు?:

ఇలా ఇజ్రాయెల్ కు అమెరికా, జర్మనీలు సహకరిస్తున్న విషయం తెరపైకి రాగా... ఇరాన్ కు చైనా సహకరిస్తుందనే విషయం వెలుగులోకి వచ్చింది! ఇందులో భాగంగా... ఈ సందర్భంగా యూఎస్ కు చెందిన ఫాక్స్ న్యూస్ ఓ కథనాన్ని ప్రచురించింది. చైనా బోయింగ్ 747 విమానాలు ఇరాన్ లోకి వచ్చాయని పేర్కొంది.వాస్తవానికి ఆ విమానాల వాటి గమ్యస్థానం లక్సెంబర్గ్ అయినప్పటికీ.. యూరోపియన్ గగనతలంలోకి ప్రవేశించలేదని.. బహుశా ఇరాన్ లో దిగి ఉంటాయని అనుమానం వ్యక్తం చేసింది. ఈ విమానాలను మిలటరీ సిబ్బంది, ఆయుధాలను తరలించడానికి వాడతారని తెలిపింది. ఈ నేపథ్యంలోనే.. ఇరాన్ కు చైనా సహారం అనే అంశాన్ని తెరపైకి తెచ్చింది!

# విష్ణు గారి సొంత అజెండా వర్కవుటయ్యేనా ..!



అమరావతి,రాజకీయాల్లో నాయకులకు అజెండాలు ఉండొచ్చు. పార్టీలపరంగా ఉన్న సిద్ధాంతాలను బట్టి నిర్ణయం తీసుకునే లేదా నిర్మించే అజెండాలను ప్రజల్లోకి తీసుకెళ్లొచ్చు. వాటిపై పోరాటం చేయడం ద్వారా వాటిని ఫాలో కావడం ద్వారా నాయకులు పదవులు కూడా పొందవచ్చు. కానీ సొంత అజెండాలు పెట్టుకుంటే మాత్రం అది చాలా ప్రమాదకరం. కొంతమందికి మాత్రమే ఈ విషయంలో కలిసి వచ్చిన పరిస్థితులు రాష్ట్రంలో చూసాం. చాలామంది సొంత అజెండాలు పెట్టుకుని రాజకీయంగా మనుగడ కోల్పోయిన వారు ఉన్నారు.ఇలా చూసుకుంటే బీజేపీలో సొంత అజెండాని అమలు చేస్తున్నారనే వాదన విష్ణుకుమార్ రాజు విషయంలో బలంగా వినిపిస్తోంది. విశాఖ ఉత్తరం నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న విష్ణు కుమార్ రాజు బిజెపి లో ఇతర నాయకులకు భిన్నంగా సొంతంగా అజెండాను ఏర్పాటు చేసుకుని దానిని సాధించేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారని వాదన వినిపిస్తోంది. గత ఏడాది ఎన్నికలకు ముందు కూడా ఇలానే సొంత అజెండా పెట్టుకున్నారని నాయకులు అంతర్గత చర్చల్లోనే కాదు బహిరంగంగా కూడా వ్యాఖ్యానించారు. టిడిపికి మద్దతుగా ఉన్నారని చంద్రబాబుకు అనుకూలంగా వ్యాఖ్యలు చేస్తున్నారని సోము వీర్రాజు లాంటి వాళ్ళు బహిరంగంగానే విమర్శించారు. దీంతోనే పార్టీలో ఆయన ఒకరకంగా ఏకాకిగా మారిన పరిస్థితి గత ఐదేళ్లలో చూడాల్సి వచ్చింది. ఆ తర్వాత కూడా ఆయన తన విధానాన్ని మార్చుకోలేకపోతుం డడం ప్రస్తుతం పార్టీలో అంతర్గత చర్చగా మారింది. సొంత అజెండాను పెట్టుకుని ఉద్దేశపూర్వకంగా కొంతమంది వ్యక్తులను ఆయన టార్గెట్ చేస్తున్నారని ఇది పార్టీకి మంచిది కాదని కూడా సోము వీర్రాజు లాంటి నాయకులు అభిప్రాయపడుతున్నారు.ముఖ్యంగా విశాఖపట్నంలో భూముల కుంభకోణం విషయంలో విష్ణుకుమార్ రాజు లేవనెత్తుతున్న అభిప్రాయాలను చంద్రబాబు సైతం యావగించుకునేలాగా ఉన్నాయనేది ప్రస్తుతం వినిపిస్తున్న మాట. సాధారణంగా వైసిపి పై విష్ణుకుమార్ రాజు నిప్పులు చేరుగుతారు. అసెంబ్లీలో అయినా ఇటు బయటైనా ఎక్కడ అవకాశం వచ్చినా తనకు ఇవ్వాల్సిన కాంట్రాక్టు సొమ్ములు ఇవ్వకుండా ఏడిపించారని తనను కూడా వైసీపీలో చేరాలని ఒత్తిడి చేశారని గతంలో ఆయన చెప్పుకొచ్చారు. ఆ తర్వాత కూడా జగన్ను పదేపదే టార్గెట్ చేస్తూ వచ్చారు. దీంతో కూటమి నాయకులు విష్ణును ఓన్ చేసుకుని వారి పక్కన సీటు కూడా కల్పించిన సందర్భాలు ఉన్నాయి.అయితే ఇప్పుడు కూటమి నాయకుల్ని విష్ణుకుమార్ రాజు టార్గెట్ చేయటం మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు కేంద్రంగా రాజకీయాలను చేస్తుండడం భూకబ్జాల విషయంలో పోరాటం చేస్తానంటూ ప్రకటనలు చేయటం వంటివి ఇటు బిజెపిలోను, అటు కూటమి నాయకులను కూడా అసంతృప్తిని రేపు తోంది. తద్వారా విష్ణుకుమార్ రాజు అందరికీ దూరం అవుతున్న పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది. నిజానికి విష్ణుకుమార్ రాజు ఉత్తరాంధ్ర రాజకీయాల్లో బలమైన నాయకుడిగా ముఖ్యంగా విశాఖపట్నంలో ఒక పద్ధతి అయిన నాయకుడిగా పేరు తెచ్చుకున్నారు.కానీ ఇటీవల కాలంలో ఆయన వేస్తున్న అడుగులు.. తీసుకుంటున్న నిర్ణయాలు అమలు చేస్తున్న సొంత అజెండా వంటివి అన్ని పార్టీల్లోనూ విస్మయాన్ని కలిగిస్తున్నాయి. అలానే ఆయనేమి బిజెపి నుంచి బయటకు వచ్చేస్తారని ఎవరు అనడం లేదు. కానీ ఉన్న పార్టీలోనే మద్దతు లేకపోతే ఆయనకు పదవులు గాని అవకాశాలు కానీ ఎలా లభిస్తాయి అన్నది అయినా ఆలోచించుకోవాలి. సొంత అజెండా మంచిదా కాదా అనేది ఆయన ఆత్మ విమర్శ చేసుకుని అడుగులు వేస్తే పార్టీలో ఆయనకు బలమైన ప్రాతినిధ్యం దక్కుతుందని సీనియర్ నాయకులే అభిప్రాయపడుతుండడం గమనార్హం.

### జగన్ యోగాలో పాల్గొంటే ఫ్రస్టేషన్ పోతుంది

అమరావతి,పులివెందుల ఎమ్మెల్యే జగన్ మానసిక స్థితి సరిగా లేక గంజాయి బ్యాచ్, బెట్టింగులకు పాల్పడే నేరగాళ్లను కలుస్తున్నాడని ఏపీ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న యోగాంధ్రలో పాల్గొంటే ఆయన ఫ్రస్టేషన్ తగ్గుతుందన్నారు.

# ప్రధాని మూడు సలహాలిచ్చారు.. లోకేశ్

న్యూఢిల్లీ,ప్రధాని మోదీతో గడిపిన క్షణాలు ఎప్పటికీ మరవలేనివాని మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యానించారు. గత నెల 17న ప్రధాని మోడీతో మంత్రి లోకేష్ భేటీ అయిన విషయం తెలిసిందే. ప్రధాని ఆహ్వానం మేరకు లోకేష్, ఆయన భార్య బ్రాహ్మణి, కుమారుడు దేవాన్ష్ తో కలిసి మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రధానితో సుమారు రెండు గంటలు వివిధ అంశాలపై చర్చించినట్లు లోకేశ్ తాజాగా వెల్లడించారు. రెండు రోజుల ఢిల్లీ పర్యటనకు వచ్చిన మంత్రి లోకేష్.. గత నెలలో ప్రధానిని కలిసిన విషయమై విలేకరులు అడిగిన ప్రశ్నకు బదులిచ్చారు. ఏడాదిగా ప్రధానితో తన సంబంధాలను పూర్తిగా వివరించారు.గత నెలలో ప్రధానితో భేటీ కావడం మరపురానిదని లోకేష్ చెప్పారు. బీజేపీతో ఎన్నికల అవగాహన కుదరిన తర్వాత ఆయనతో కలిసి రెండు సభల్లో పాల్గొన్నానని, రాజమండ్రి సభలో కూటమి ఎన్నిసీట్లు గెలుచుకుంటుందని తనను అడిగినట్లు లోకేష్ వెల్లడించారు. మూడు పార్టీలు కలిసి పనిచేస్తే 22 సీట్లు గెలుచుకుంటామని తాను చెబితే అన్ని వస్తాయా? అంటూ అప్పుడు ప్రధాని మోడీ ఆశ్చర్యపోయారని చెప్పారు. ప్రమాణ స్వీకార సభలో కూటమికి 21 సీట్లు వచ్చాయని తాను గుర్తు చేస్తే బాగా పనిచేశారంటూ అభినందించారని లోకేష్ గుర్తు చేసుకున్నారు.అప్పుడే ఢిల్లీ వచ్చి తనను కలవాలని ఆహ్వానించారని, కానీ, ఆయనకు కలిసేంత సమయం ఉండదని తాను వెళ్లలేదని చెప్పారు. అయితే ప్రధాని విశాఖ వచ్చినప్పుడు మీ అబ్బాయి ఢిల్లీ రమ్మంటే రావడం లేదని చంద్రబాబుకు ఫిర్యాదు చేశారని, మళ్లీ అమరావతిలో రాజధాని పనుల పునఃప్రారంభోత్సవ సభలో నువ్వు ఢిల్లీ రానందుకు శిక్షిస్తానని వీపుపై రెండు దెబ్బలు వేసినట్లు చెప్పారు. ఇక తప్పదని గత నెలలో ఆయన అపాయింట్‌మెంట్ తీసుకున్నానని లోకేష్ తెలిపారు. గత 25 ఏళ్లుగా గుజరాత్ సీఎం, దేశానికి ప్రధానిగా పనిచేస్తున్న మోడీ వెనుక ఉన్న శక్తి ఏంటి? ఆయనకు అంత ఉత్సాహం ఎలా వచ్చిందన్న ఆసక్తితోనే ఆయనను కలిశానని వివరించారు లోకేష్.ప్రధానితో భేటీ అయిన రెండు గంటల్లో తొలి గంట పూర్తిగా రాష్ట్రంలో ఏం జరుగుతుందనేది పూర్తిగా తెలుసుకున్నారని చెప్పారు. ఈ భేటీలో ప్రధాని తనకు మూడు విలువైన సూచనలిచ్చారని మంత్రి లోకేష్ తెలిపారు. "నా ఆలోచనలు స్పీడుగా ఉంటాయి. అదే సమయంలో తప్పులు కూడా జరుగుతాయని, తనను గైడ్ చేయాలని" ప్రధానిని కోరినట్లు



చెప్పారు. పని చేసే వారే తప్పులు చేస్తారని, ఇంట్లో పడుకుంటే చేయం కదా, మనం నిజాయితీగా పనిచేస్తే ప్రజలు కూడా అర్థం చేసుకుంటారని మోదీ మొదటి సలహాగా చెప్పారు.నువ్వు ఎదిగేందుకు మీ నాన్న ఎన్నో అవకాశాలు కల్పిస్తున్నారు. వాటిని ఉపయోగించుకుని స్వతంత్రంగా నాయకుడిగా ఎదగాలని రెండో సలహా ఇచ్చారు. ఇక దేశ శ్రేయస్సు కోసం ప్రజా ప్రయోజనాలపై దృష్టి సారించి నిరంతరం కష్టపడాలని చివరిగా సూచించారు. ఆయనతో సమావేశం ఇలా జరగడం ఇప్పటికీ నమ్మలేకపోతున్నాను. సమావేశం నుంచి వచ్చాక తెల్లవారు జామున నాలుగింటి వరకూ నిద్రపట్టలేదు అని లోకేశ తెలిపారు. ప్రధాని అంత సమయం ఇచ్చి చెప్పిన విషయాలను సీరియస్ గా తీసుకోవాలనుకున్నానని చెప్పారు.

### పరామర్శల పేరుతో రెచ్చగొట్టే కుట్రలు

అమరావతి,పరామర్శల పేరుతో సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టాలన్న జగన్ కుట్రలు చెల్లవని తెదేపా సీనియర్ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. పల్నాడు జిల్లా పర్యటనలో వైకాపా కార్యకర్తలు చేసిన వీరంగం, విన్యాసాలు వారి ఉన్మాద మనస్తత్వానికి పరాకాష్ఠ అని దుయ్యబట్టారు. 'ఐదేళ్ల వైకాపా అరాచకాలకు 11 సీట్లతో ప్రజలు ప్రతిపక్ష హోదా లేకుండా చేసినా వైకాపా వైఖరిలో మార్పు రాలేదు. జగన్ సహా ఆ పార్టీ నేతలు వ్యవహరించిన తీరు ప్రజాస్వామ్యాన్ని పరిహసించేలా ఉంది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com